ప్రతిపక్షం
www.prathipaksham.in

శుక్రవారం 20.03.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 359 పేజీలు: 8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

భారత్‌లో వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్స్ 8

చలనచిత్ర పరిశ్రమ కేంద్రంగా తెలంగాణ

సినిమా అనుమతుల కోసం సింగిల్ విండో విధానం

- అందుకు త్వరలోనే ఒక ప్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తాం
- ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఒక చైతన్యం, స్ఫూర్తి
- అందుకే గద్దర్ పేరుతో అవార్డులను పునరుద్ధరించాం
- తెలంగాణ అత్యంత భద్రత కలిగిన రాష్ట్రం
- హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుంది
- హాలీవుడ్ చిత్రాలను ఇక్కడ నిర్మించండి
- గద్దర్ ఫిలిం అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్
- చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 19: తెలంగాణ కేంద్రంగా చలనచిత్ర పరిశ్రమల అభివృద్ధి చెందడానికి, సినిమాలకు సంబంధించి అవసరమైన అన్ని రకాల అనుమతుల కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నట్టుగానే హైదరాబాద్‌ను గ్లోబల్ సినీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల బహూకరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావు, పలువురు ఎంపీలు, సలహాదారులు,

...:: మిగతా 2లో

మూడు లక్షల 20 వేల కోట్లు

అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న భట్టి

మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు

ఆర్థిక పరిమితులు, ఆదాయ అంచనాను పరిగణలోకి అవసరాల ఆధారంగా పద్దుల ఖరారు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 19: రాష్ట్ర ప్రభుత్వం ఉభయసభల్లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు 2026-27 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శాసనసభలో, మంత్రి శ్రీధర్ బాబు మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. శుక్రవారం ఉదయం సమావేశం కానున్న రాష్ట్ర మంత్రివర్గం బడ్జెట్ పై చర్చించి ఆమోదం తెలపనుంది. బడ్జెట్ కోసం సర్కార్ ఇప్పటికే కసరత్తు పూర్తి చేసింది. ఆర్థిక పరిమితులు, ఆదాయ అంచనాను పరిగణలోకి తీసుకొని వాస్తవిక బడ్జెట్ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. ఇప్పటి వరకు ఉన్న పథకాలు, కార్యక్రమాలకు తగిన కేటాయింపులు చేస్తూనే కొత్తగా కొన్నింటికి నిధులు సర్దుబాటు చేసే అవకాశం కనిపిస్తోంది. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు తగిన కేటాయింపులు చేస్తూనే మౌలికసదుపాయాలకు తగిన ప్రాధాన్యత ఇస్తూ మూలధన పెట్టుబడి ఆవశ్యతను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు

...:: మిగతా 2లో

₹ 2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్

- ఇక నుంచి ఏటా ఉగాది రోజు ప్రజా బడ్జెట్
- ప్రభుత్వం మా బడ్జెట్ ప్రతిపాదనలను తీసుకోవాలి
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత
- ఘనంగా శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 19: రూ.2,15,200 కోట్లతో ప్రజాబడ్జెట్ ను తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రతిపాదించారు. ఉగాది సందర్భంగా తెలంగాణ జాగృతి తరపున ప్రజా బడ్జెట్ ప్రవేశ పెడుతున్నామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఇక నుంచి ఏటా ఉగాది రోజు జాగృతి తరపున

...:: మిగతా 2లో

కవిత పార్టీ విషయంలో తర్వగా నిర్ణయం తీసుకోండి

- కేంద్ర ఎన్నికల సంఘానికి ఢిల్లీ కోర్టు ఆదేశం
- 'తెలంగాణ ప్రజా జాగృతి' పేరిట ఈసీకి కవిత దరఖాస్తు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, మార్చి 19: పార్టీ నమోదు వ్యవహారంలో మాజీ ఎంపీ కల్వకుంట్ల కవితకు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. కవిత కొత్త పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి' అంశంలో

...:: మిగతా 2లో

సాదా బైనామా భూములకు త్వరలో పరిష్కారం

- రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు
- రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుంది
- ఈ నెల 22న రైతు భరోసా అందించబోతున్నాం
- ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 19: తెలంగాణలో సాదా బైనామా భూములకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా చేసి రైతును రాజుగా నిలబెట్టాలన్న సంకల్పంతో ముందుకు వెళుతున్నామని సీఎం చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతి శాఖ, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో నిర్వహించిన శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి

...:: మిగతా 2లో

ఇంధన క్షేత్రాలపై ఇరాన్ దాడులు

...:: 3లో

అధిక లాభాలను అందించే

పామాయిల్ తోటలను సాగు చేయాలి

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి
- పంట మార్పిడికి సిద్ధం కావాలి: మంత్రి తుమ్మల
- రైతు సదస్సులను వినియోగించుకోవాలి: మంత్రి పొన్నం
- నర్మెటలో వ్యవసాయ ప్రదర్శన ప్రారంభం

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట

మార్చి 19: వడ్లను కొనుగోలు చేయలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పిన నేపథ్యంలో రైతులు అధిక లాభాలను అందించే పామాయిల్ తోటలను పెంచేందుకు ముందుకు రావాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెటలోని ఆయిల్ పామ్ కర్మాగారం వద్ద ప్రజాపాలన రైతు మహోత్సవంలో భాగంగా గురువారం వ్యవసాయ ప్రదర్శన ప్రారంభించారు. వ్యవసాయ, ఉద్యానవన, సంవర్ధక శాఖల తో పాటు వ్యవసాయ అనుబంధ శాఖలకు చెందిన వ్యవసాయ ప్రదర్శన స్టాళ్లను ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సిద్దిపేట,

...:: మిగతా 3లో

ప్రభుత్వ విప్‌లుగా అద్దంకి, బల్మూరి

- నియామకాలు తక్షణమే అమల్లోకి
- ఉత్వర్వులు జారీ చేసిన సీఎస్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 19: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల వేళ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శాసన సభ, శాసన మండలికి కొత్త విప్లను నియమించింది. శాసన మండలిలో ప్రభుత్వ విప్లుగా అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ నియమితులయ్యారు. శాసన సభలో ప్రభుత్వ విప్లుగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావులను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల వేళ ప్రభుత్వ విప్ల నియాకమం ప్రాధాన్యత సంతరించుకుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ – 6.33
(శుక్రవారం సాయంత్రం)

శనివారం
ఈద్-ఉల్-ఫిత్ర్

వెంటనే సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలి

పశ్చిమాసియా యుద్ధంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానులతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం టెలిఫోన్‌లో సంభాషించారు.

7

దేశంలో దాడులకు ప్లాన్

దేశంలో ఉగ్రవాద దాడులు జరిపేందుకు కుట్ర పన్నుతున్న ఓ ముఠా పట్టుబడింది.అధికారులు ఉగ్రకోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. ఉత్తర్ ప్రదేశ్ హాపుడ్‌లోని మొఘల్ గార్డెన్‌లో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేశారు.

7

బెంగాల్‌లో అప్రకటిత ఎమర్జెన్సీ

బెంగాల్ లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘం, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉన్నతాధికారులను బదిలీ చేయడం అన్‌డిక్లేర్డ్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె పేర్కొన్నారు.

7

మూడు లక్షలా 20 వేల కోట్లు

మొదటిపేజీ తరువాయి

చెప్తున్నారు. మరోమారు మూడు లక్షల కోట్ల మార్కును దాటనున్న రాష్ట్ర వార్షిక బడ్జెట్ మూడు లక్షలా 20 వేల నుంచి 30 వేల కోట్ల మధ్యన ఉండే అవకాశం కనిపిస్తోంది.

అవసరాల ఆధారంగా పద్దుల ఖరారు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 ఆదాయ, వ్యయాలను పరిగణలోకి తీసుకొని ఆయా శాఖల అవసరాల ఆధారంగా పద్దులను ఖరారు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క అధికారులతో పలు దఫాలు సమావేశమై, అన్ని అంశాలను పూర్తి స్థాయిలో సమీక్షించి బడ్జెట్ పద్దులకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న మూడో పూర్తి స్థాయి బడ్జెట్ ఇది. 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన అనంతరం 2024 ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం 2024 జూలైలో, 2025 మార్చిలో పూర్తి స్థాయి బడ్జెట్లను ప్రవేశపెట్టింది. శుక్రవారం ప్రవేశపెడుతున్న బడ్జెట్ మూడో పూర్తి స్థాయి బడ్జెట్ కానుంది. గత రెండు ఆర్థిక సంవత్సరాల బడ్జెట్లను బేరీజు వేసుకుంటూ తదుపరి వార్షిక ప్రణాళికకు సర్కార్ సిద్ధమైంది.

వ్యవసాయ రంగమే తొలి ప్రాధాన్యం

వివిధ పథకాలు, కార్యక్రమాలతో పాటు 2023 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు ఉండనున్నాయి. ఆయా వర్గాల సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం కేటాయింపులు చేయనున్నారు. రాష్ట్రంలో ఎక్కువ మంది ప్రజలకు ఆధారమైన వ్యవసాయ రంగమే తొలి ప్రాధాన్యం కానుంది. రైతుల అభివృద్ధి, వ్యవసాయరంగ అభివృద్ధి నిధులు పొందుపర్చనున్నారు. ఇదే సందర్భంగా విద్య, వైద్యం, పంచాయతీరాజ్, పురపాలక ఇలా వివిధ రంగాలకు సర్కార్ ప్రాధాన్యతలకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు ప్రతిపాదించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా సంక్షేమం కోసం అమల్లో ఉన్న పథకాలు, కార్యక్రమాలకు నిధులు కేటాయించనున్నారు. కొత్తగా పాఠశాల విద్యార్థులకు అల్పాహార పథకం, ఐటీఐ విద్యార్థులకు ఉపకారవేతనాలు, లాంటి వాటికి కేటాయింపులు చేసే అవకాశం ఉంది. మౌలికసదుపాయాలకు తగిన ప్రాధాన్యం ఇచ్చి నిధులు ప్రతిపాదించే పరిస్థితి కనిపిస్తోంది. హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాజెక్టులు, మూసీ సుందరీకరణ, ఫ్యూచర్ సిటీ సహా ఇతరాలకు నిధులు పొందుపర్చే అవకాశం ఉంది. మెట్రో రైలును ఎల్ అండ్ టీ నుంచి స్వాధీనం చేసుకోవడంతో పాటు విస్తరణకు అవసరమైన నిధులు, రోడ్ల నిర్మాణం కోసం తగిన కేటాయింపులు చేసే అవకాశం కనిపిస్తోంది. అటు మూలధన పెట్టుబడి కోసం కేటాయింపులు పెంచాలన్న అభిప్రాయం ప్రభుత్వ వర్గాల్లో బలంగా ఉంది. ఈ అంశాలన్నింటిని పరిగణలోకి తీసుకొని నిధులను ప్రతిపాదించనున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వృద్ధి రేటు, వచ్చే ఏడాది వృద్ధి అంచనాను పరిగణలోకి తీసుకొని 2026-27 పద్దు ఉండనుంది. మూడు లక్షలా 20 వేల కోట్ల నుంచి మూడు లక్షలా 30 వేల కోట్ల మధ్యలో రాష్ట్ర బడ్జెట్ ఉండే అవకాశం ఉందని అంటున్నారు.

చలనచిత్ర పరిశ్రమ కేంద్రంగా తెలంగాణ

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, తెలంగాణ ఫిల్మ్ డెవలప్మెంట్ చైర్మన్ దిల్ రాజు, చిత్ర పరిశ్రమకు చెందిన దిగ్గజాలు చిరంజీవి, కమల్ హాసన్, అక్కినేని నాగార్జున, మాధురీ దీక్షిత్, జయసుధ, ఖుష్బూ గార్లతో పాటు దర్శకులు, నిర్మాతలు, నటీనటులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. ఐటీ, ఫార్మా తరహాలోనే సినిమా రంగాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పోత్సహించాలన్న ఆలోచన చేసిన కారణంగానే రాష్ట్రంలో గత పదేళ్లుగా ఆగిపోయిన నంది అవార్డుల స్థానంలో గద్దర్ గారి పేరుతో అవార్డులను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఆగిపోయిన 10 ఏళ్ల అవార్డులనూ బహూకరించామని తెలిపారు. రెండో విడతగా నిర్వహించుకుంటున్న ఈ కార్యక్రమంలో అవార్డు గ్రహీతలందరికీ తెలంగాణ ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. గద్దర్ సినిమా అవార్డులను ప్రధానం చేయడం తెలంగాణ ప్రభుత్వం ఒక బాధ్యతగా భావించిందని సీఎం తెలిపారు. ఒకప్పుడు చెన్నై నుంచి హైదరాబాద్‌కు సినిమా పరిశ్రమ తరలిరావడానికి ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వర రావు, రామానాయుడు, కృష్ణ తీవ్రమైన కృషి చేశారని, చార్మినార్‌కు నాలుగు మినార్లు ఎలాగో తెలుగు సినిమా పరిశ్రమ తరలి రావడానికి ఈ నలుగురు విశేషంగా కృషి చేశారని సీఎం అన్నారు. సినీ కార్మికుల కోసం నటుడు ప్రభాకర్ రెడ్డి తన సొంత స్థలాన్ని ఇళ్లు కట్టుకోవడానికి దానమిచ్చారని, పరిశ్రమలో ఏ సమస్య వచ్చినా, సంక్షోభం వచ్చినా పరిష్కరించడానికి దర్శకుడు దాసరి నారాయణ రావు చేసిన కృషి గుర్తు చేసుకోవలసిన అవసరం ఉందని, రామోజీరావు రామోజీ ఫిల్మ్ సిటీ స్థాపించడంతో హైదరాబాద్‌లో సినిమా పరిశ్రమ శాశ్వతంగా వేళ్లూనుకోవడానికి కారణమైందని సీఎం ఈ సందర్భంగా అన్నారు. హిందీ, తమిళ్, కన్నడ, మలయాళం, తెలుగు అని కాకుండా పాన్ ఇండియా సినిమా ఒక గ్లోబల్ హబ్‌గా పరిశ్రమ మొత్తం ఒకే గొడుగు కిందకు వచ్చి గొప్ప సినిమాలు అందించాల్సిన అవసరం ఉందని, హాలీవుడ్ సినిమాలను సైతం హైదరాబాద్ నగరానికి ఆహ్వానించి ఇక్కడి నుంచే నిర్మించేలా ఉన్నతంగా తీర్చిదిద్దుకుందామని సీఎం అన్నారు. 'ఓటీటీ ఫ్లాట్ ఫామ్ లో దిగ్గజ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఇటీవలే హైదరాబాద్ తన కేంద్రాన్ని ప్రారంభించింది. నెట్‌ఫ్లిక్స్ రాకతో హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్టే. అంతర్జాతీయ స్థాయిలో ఇక్కడ సినిమాల నిర్మాణం కోసం సింగిల్ విండో విధానం అమలు చేస్తాం. అందుకు త్వరలోనే ఒక ఫ్లాట్‌ఫామ్ క్రియేట్ చేస్తాం.' అని సీఎం అన్నారు. 'లక్షల కోట్ల మందిని తన గళంతో ప్రజలను ప్రభావితం చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ ఒక చైతన్యం, స్ఫూర్తి, అందుకని గద్దర్ పేరుతో ఈ అవార్డులను పునరుద్ధరించాం. సామాజిక సమస్యలను పరిష్కరించుకోవడానికి సినిమాలు అత్యంత ప్రభావవంతమైన ఆయుధం.' అని అన్నారు. సమాజాన్ని చైతన్య పరిచేందుకు సినిమా ఒక సాధనంగా ఉపయోగపడాలని, సామాజిక బాధ్యతను గుర్తెరిగి, సామాజిక సమస్యల పరిష్కారానికి సినిమాల ద్వారా సందేశం అందించాలని సీఎం కోరారు. హైదరాబాద్, తెలంగాణ అత్యంత భద్రత కలిగిన రాష్ట్రం. టాలెంట్‌కు అవకాశాలున్నాయని, హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని సీఎం ప్రకటించారు. "హాలీవుడ్ చిత్రాలను ఇక్కడ నిర్మించండి. మీ పెట్టుబడులకు భద్రత ఉంటుంది. అందుకు తెలంగాణ ప్రభుత్వం హామీనిస్తుంది..." అని చెప్పారు.

అవార్డులు అందుకున్నది వీరే..

ప్రత్యేక విభాగంలో కొణిదెల చిరంజీవి (ఎన్టీఆర్ జాతీయ పురస్కారం), సింగీతం శ్రీనివాస రావు (బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు), చలసాని అశ్వినీదత్ (నాగిరెడ్డి - చక్రపాణి అవార్డు), సుద్దాల అశోక్ తేజ (డాక్టర్ సి. నారాయణరెడ్డి అవార్డు), జయసుధ (అక్కినేని నాగేశ్వరరావు అవార్డు), ఆర్ నారాయణ మూర్తి (కాంతారావు అవార్డు), అక్కినేని రమేష్ ప్రసాద్ (రఘుపతి వెంకయ్య అవార్డు), కమల్ హాసన్ (పైడి జైరాజ్ అవార్డు), ఉత్తమ నటుడు అక్కినేని నాగ చైతన్య (తండేల్), ఉత్తమ నటిగా రష్మిక మందన్న (ది గర్ల్ ఫ్రెండ్)లతో పాటు వివిధ కేటగిరీల్లో విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందించారు.

చిరంజీవికి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం

తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నటుడు చిరంజీవి ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. "విజేతలకు అభినందలు తెలియజేస్తున్నా. తెలుగు ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు. కళాకారులు ఉన్న చోట సుభిక్షంగా ఉంటుందన్నది నానుడి. ఈ అవార్డులు అందజేస్తున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా" అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అవార్డులు ఇస్తే కళాకారులకు ప్రోత్సాహకంగా ఉంటుందంటూ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. పైడి జయరాజ్ పురస్కారాన్ని కమల్ హాసన్, నాగిరెడ్డి చక్రపాణి అవార్డును నిర్మాత అశ్వనీతదత్, కె.ఎల్. కాంతారావు ఫిల్మ్ అవార్డును ఆర్. నారాయణ మూర్తి, సి. నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డును సుద్దాల అశోక్ తేజ, అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ అవార్డును జయసుధ స్వీకరించారు. బీఎన్‌రెడ్డి ఫిల్మ్ అవార్డును దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరపున (ఈవెంట్కు ఆయన హాజరుకాకపోవడంతో) కమల్ హాసన్ అందుకున్నారు. ఉత్తమ నటుడిగా నాగచైతన్య (తండేల్), ఉత్తమ నటిగా రష్మిక (ది గర్ల్ ఫ్రెండ్), ఉత్తమ దర్శకుడిగా సాయిలు (రాజు వెడ్స్ రాంబాయి) తదితరులు సీఎం నుంచి అవార్డులు అందుకున్నారు. ఈ వేడుకలో పలువురు టాలీవుడ్ ప్రముఖులతోపాటు రితేశ్ దేశముఖ్ జెనీలియా దంపతులు, మాధురీ దీక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

సాదా బైనామా భూములకు త్వరలో పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ పరాభవ నామ ఉగాది పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రకృతి వైపరీత్యాలు రాకుండా ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపిన సీఎం ఈ నెల 22న రైతు భరోసా అందించబోతున్నామని తెలియజేస్తూ రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌మాట్లాడుతూ రైతు సంక్షేమం, అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. "ధరణి రూపంలో భూతమై రైతులను బాధ పెడుతున్న సందర్భంగా రైతులకు అండగా దాన్ని తరిమేసి భూ భారతితో రైతాంగ సమస్యలను పరిష్కరిస్తున్నాం. సాదా బైనామాకు సంబంధించి తొందరలోనే పరిష్కారం చూపించబోతున్నాం. సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న రైతాంగాన్ని గట్టెక్కించడానికి పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు బోనస్ కూడా ఇచ్చి ఆదుకుంటున్నాం. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన లెక్కల మేరకు దేశంలో అతితక్కువ రుణభారం కలిగిన రైతులున్న రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో ఉండటం గర్వకారణం. పరిశ్రమలు ఎన్ని వచ్చినా, ఐటీ రంగాలు ఎంతగా రాణించినప్పటికీ రాష్ట్రంలో ఇప్పటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయమే. రైతులు బాగున్నప్పుడే రాష్ట్రం బాగుంటుంది. రాష్ట్రంలో 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ. 20,616 కోట్ల మేరకు రుణమాఫీ చేసి రైతులను ఆత్మగౌరవంతో బతకడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేసింది. ప్రతి ఎకరాకు రూ. 12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నాం. ఇప్పటికే ప్రభుత్వం 18 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కింద అందించింది. పండించిన పంటలపై రైతుల్లో విశ్వాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. వ్యవసాయ రంగానికి ఉచిత కరెంట్, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, రుణమాఫీ చేయడం, రైతుభరోసా అందించడంతో పాటు రైతు బీమా అమలు చేయడం వంటివన్నీ రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు. ప్రభుత్వం రైతుల కోసం ప్రయత్నాలు, నిర్మిస్తున్న సాగునీటి ప్రాజెక్టులు, సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలన్నీ దేశంలో తెలంగాణ ప్రతిష్టను పెంపొదిస్తాయి. మన పొలాల్లో సమృద్ధిగా పంటలు పండినప్పుడే రాష్ట్రం సుఖశాంతులతో విలసిల్లుతుంది.." అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్, పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రముఖ జ్యోతిష్యులు డాక్టర్ బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఆలయాలకు చెందిన అర్చకులను ముఖ్యమంత్రి సత్కరించారు.

కవిత పార్టీ విషయంలో తర్వగా నిర్ణయం తీసుకోండి

మొదటిపేజీ తరువాయి

త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. కవిత దరఖాస్తులో లోపాలున్నాయని గతంలో కేంద్ర ఎన్నికల సంఘం కోర్టుకు చెప్పింది. దీంతో లోపాలన్నీ సరిచేసినట్లు కవిత తరపు న్యాయవాదులు తెలిపారు. ప్రజాప్రాతినిధ్య చట్టం1951లోని సెక్షన్ 29ఎ కింద రాజకీయ పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి' నమోదు కోసం చేసిన తన దరఖాస్తును కేంద్ర ఎన్నికల సంఘ వేగంగా పరిశీలించి నిర్ణయం వెలువరించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, దరఖాస్తులో చాలా లోపాలున్నాయంటూ ఆమెకు ఫిబ్రవరి 23నే సమాచారం పంపామని ఈసీఐ తరపు న్యాయవాది ఫిబ్రవరి 27న విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టుకు తెలిపారు. ఆ రోజు కవిత తరపు ముఖ్య న్యాయవాది ఆసుపత్రిలో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని కోరడంతో కేసు మార్చి 19కి వాయిదా పడింది. గురువారం విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు కవిత కొత్త పార్టీ 'తెలంగాణ ప్రజా జాగృతి' అంశంలో త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది.



బుమ్రా రిటైర్మెంట్ తర్వాత భారత బౌలింగ్ విభాగం చాలెంజెస్ ఎదుర్కొవాల్సి వస్తుంది. ప్రస్తుతం బ్యాటర్ల డామినేషన్ నడుస్తోంది. ఇది ఇప్పటి పిల్లలు బౌలింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోకుండా డిస్‌కరేజ్ చేస్తుంది బుమ్రా లాంటి మ్యాచ్ విన్నర్ లేకపోతే టోర్నీలు గెలవడం కష్టం. టీమ్ ప్రయోజనాలకే ఇంపార్టెన్స్ ఇచ్చే గంభీర్ శైలి అభినందనీయం

- అశ్విన్, మాజీ క్రికెటర్

₹ 2,15,200 కోట్లతో జాగృతి ప్రజా బడ్జెట్

మొదటిపేజీ తరువాయి

ప్రజా బడ్జెట్ ఉంటుందన్నారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో సంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పంచాంగ శ్రావణం చేశారు. ఉగాది వేడుకల్లో కల్వకుంట్ల కవిత, అనిల్ దంపతులు, తెలంగాణ జాగృతి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఉగాది వేడుకల అనంతరం తెలంగాణ జాగృతి ప్రజాబడ్జెట్ ప్రతిపాదనలను కవిత ప్రకటించారు. ఈ ఏడాది రూ. 2 లక్షల 15 వేల 2 వందల కోట్లతో ప్రజాబడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా 3 లక్షల కోట్లకు పైగా అంచనాలతో రేపు బడ్జెట్ ప్రవేశపెట్టనుందని, తాము మాత్రం 2 లక్షల 15 వేల కోట్లతోనే బడ్జెట్ ప్రతిపాదిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వానికి అదనంగా మరో లక్ష కోట్ల వరకు బడ్జెట్ కేటాయింపులు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. ఆ మొత్తం గాంధీ కుటుంబ సభ్యులే కాదు తమకు నచ్చిన వారి పేర్లతో పథకాలు ప్రకటించుకోవచ్చన్నవారు. తాము ప్రతిపాదించిన మొత్తం ప్రజా సంక్షేమం, రాష్ట్ర పురోగతికి ఉపయోగపడేలా ఉంటుందని చెప్పారు. ప్రజల నుంచి వచ్చిన సూచనల మేరకే తాము ఈ ప్రజా బడ్జెట్ ను కేటాయించామన్నారు. ప్రజా బడ్జెట్ లో విద్య, వైద్యం, సంక్షేమానికి పెద్ద పీట వేశారు.

ప్రజా బడ్జెట్ లో కేటాయింపులు...

విద్యారంగానికి రూ.30 వేల కోట్లు, వైద్య, ఆరోగ్య శాఖకు రూ.25 వేల కోట్లు, యూనివర్సిటీ విద్యకు రూ.2 వేల కోట్లు వృద్ధులు, వికలాంగులు సహా ఇతర పింఛన్లకు రూ.25 వేల కోట్లు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.20 వేల కోట్లు, తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్లు, అమరవీరుల కుటుంబాలకు పెన్షన్లకు రూ.5 వేల కోట్లు, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం అందజేయడానికి రూ.100 కోట్లు, 18 ఏళ్లు నిండిన యువతులకు స్కూటీల పంపిణీకి రూ.5 వేల కోట్లు, రైతులు, కౌలు రైతులకు ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వడంతో పాటు రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల సాయం అందించడానికి రూ.35 వేల కోట్లు, 16 లక్షల మంది యువతకు రాజీవ్ యువ వికాసం సాయం చేయడానికి రూ.5 వేల కోట్లు, బీసీల సంక్షేమానికి రూ.20 వేల కోట్లు, ఎస్సీ ల సంక్షేమానికి రూ.18 వేల కోట్లు, ఎస్టీల సంక్షేమానికి రూ.10 వేల కోట్లు, మైనారిటీల సంక్షేమానికి రూ.5 వేల కోట్లు, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ సాయంతో పాటు తులం బంగారం ఇవ్వడానికి రూ.10 వేల కోట్లు, ఎంఎస్‌ఎంఈలు, పారిశ్రామిక వేత్తలకు ప్రోత్సాహకాల కోసం రూ.10 వేల కోట్లు, 50 ఏళ్లు నిండిన కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 పింఛన్ ఇస్తే కేంద్ర ప్రభుత్వం రూ.5,500 కలిపి ఇస్తుంది.. దీనిని సద్వినియోగం చేసుకొని లక్ష మంది కళాకారులకు పింఛన్ ఇవ్వడానికి రూ.100 కోట్లను ప్రజా బడ్జెట్ లో కేటాయింపులు చేశారు. ఇదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో కేటాయింపులు జరిపిన తర్వాత కూడా లక్ష కోట్ల మిగులు ఉంటుందని కవిత అన్నారు. తాము ప్రతిపాదించిన బడ్జెట్ కారణంగా రాష్ట్ర పురోగతితో పాటు సంపద సృష్టి జరుగుతుందని అన్నారు.

ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు

ఉగాది కొత్త సంవత్సరం ఆరంభానికి నాంది అన్నారు. ఉగాది రోజు మంచి చేసేలా జాగృతి నాయకులు, కార్యకర్తలంతా కంకణబద్ధలవ్వాలని పిలుపునిచ్చారు. పక్క వాళ్ల బాగుకోసం ప్రాణాలిచ్చే నేల తెలంగాణ అని అన్నారు. ఆ సంకల్పాన్ని తీసుకొని ప్రజల కోసం పనిచేయాలని జాగృతి నాయకులకు సూచించారు. శ్రీ పరాభవనామ సంవత్సరం సందర్భంగా జాగృతి కార్యాలయంలో పంచాంగ శ్రావణం జరపటం ఆనందంగా ఉందన్నారు. సనాతన ధర్మం ఎంతో గొప్పదని, ఆ సంస్కృతి గౌరవాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని కోరారు. పరాభవనామ సంవత్సరం అంటే అవమానాలు కాదని... అమ్మవారు, శివుడు కలిసి ఉండే సంవత్సరమని చెప్పారు. ఈ ఏడాది తెలుగు ప్రజలు, తెలంగాణ ప్రజలకు మంచి జరగాలని ఆకాంక్షించారు.

అధిక లాభాలను అందించే

పామాయిల్ తోటలను సాగు చేయాలి

మొదటిపేజీ తరువాయి

దుబ్బాక శాసనసభ్యులు తన్నీరు హరీశ్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవ రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని వివిధ స్టాళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంట మార్పిడి చేసుకుని ఆయిల్ పామ్ తోటలను పెంచాలని సూచించారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చే వరకు కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఎకరానికి ఇస్తున్న రూ.4200ల ఆర్థిక సాయానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని తెలిపారు.

పంట మార్పిడికి సిద్ధం కావాలి
తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి

దేశంలోనే అధిక వరి ధాన్యాన్ని పండించే స్థితికి రాష్ట్రం చేరుకుందని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. ఈ స్థితిలో వరి ధాన్యాన్ని సేకరించలేమని కేంద్ర ప్రభుత్వం పక్షం రోజుల కిందట స్పష్టం చేసిందని చెప్పారు. వరి పండించే రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు మొగ్గుచూపాల్సిన అవసరం ఉందని తెలిపారు. రైతులు పంట మార్పిడికి సిద్ధమై స్థిర ఆదాయాన్ని అందించే ఆయిల్ పామ్ తోటలను సాగు చేయాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలను సాగు చేసే రైతులకు ఎకరానికి 51 వేల రాయితీని ఇస్తున్నట్లు తెలిపారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతరస్ పంటలను సాగు చేసి అదనపు ఆదాయాన్ని పొందవచ్చని చెప్పారు. నర్మెటలో ఆయిల్ పామ్ కర్మాగారం కోసం స్థానిక శాసనసభ్యుడు తన్నీరు హరీశ్ రావు ఆధ్వర్యంలో స్థలాన్ని సేకరించి గత ప్రభుత్వంలో నిర్మాణానికి సన్నాహాలు చేశారని తెలిపారు. రాష్ట్రంలో దిగుమతి చేసుకుంటున్న పంటల సాగుకు రైతులు ముందుకు రావాలని చెప్పారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

రైతు సదస్సులను వినియోగించుకోవాలి
రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజా పాలన రైతు మహోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు నిర్వహించే రైతు ప్రదర్శనలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రదర్శన సందర్భంగా రైతులకు సదస్సుల ద్వారా వివిధ విషయాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటలను పెంచే రైతులకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేస్తున్నదని మెదక్ ఎంపీ రఘునందన రావు తెలిపారు. ఆయిల్ పామ్ తోటలను సాగు చేసిన రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.4200ల ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. ప్రతి రైతుకు ఈ ఆర్థిక సహాయం అందేలా చేయాల్సిన బాధ్యత ఆయిల్ ఫెడ్ అధికారులదేనని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం పట్ల కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని పేర్కొన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుతో పెరిగిన తేమశాతం
మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే -తన్నీరు హరీశ్ రావు

కాళేశ్వరం ప్రాజెక్టుతో సిద్దిపేట ప్రాంతంలో తేమశాతం పెరిగి ఆయిల్ పామ్ తోటల సాగుకు అనుకూలంగా మారిందని మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు తెలిపారు. 2018 వ సంవత్సరంలో ఆయిల్ పామ్ తోటల సాగు కోసం ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు ఇక్కడ పరిశోధనలు జరిపి తేమశాతం లేదని పంట సాగుకు ఇక్కడి నేలలు అనుకూలం కావని నివేదిక ఇచ్చారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ జలాశయాలను నిర్మించి చెరువులు కుంటలు నింపడంతో తేమశాతం పెరిగిందన్నారు. దీంతో మళ్లీ పరిశోధన చేసిన శాస్త్రవేత్తలు ఆయిల్ పామ్ తోటలను పెంచవచ్చునని నివేదిక ఇచ్చారని చెప్పారు. ఆయిల్ పామ్ తోటల నుంచి దిగుబడి వచ్చే వరకు రైతులకు ఆర్థిక సహాయం అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కోరారు.

రూ. 13 లక్షల ఆదాయం వచ్చింది
తిప్పని భాగ్యలక్ష్మి, ఆయిల్ పామ్ రైతు

ఏడెకరాలలో ఆయిల్ పామ్ తోటలను సాగు చేసినట్లు నంగునూరు మండలం అక్కెనపల్లికి చెందిన రైతు తిప్పని భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. ఏడెకరాలలో పంట చేతికి రావడంతో అన్ని ఖర్చులు పోను రూ.13 లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో అంతర పంటలుగా మొక్కజొన్న, పత్తి వంటివి సాగు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా అదనపు ఆదాయం వచ్చిందని తెలిపారు. మరో 9 ఎకరాలలో ఆయిల్ పామ్ తోటలను పెంచుతామని వివరించారు. అంతకుముందు రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన మరియు గనుల శాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఈ కార్యక్రమంలో పాల్గొని స్టాల్ ను ప్రారంభించారు.

రైతు ఉత్సవాల్లో గందరగోళం

రైతు మహోత్సవం సందర్భంగా నర్మెటలో గురువారం గందరగోళం చోటు చేసుకుంది. ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ వద్ద రైతు ఉత్సవాలను ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేశారు. మంత్రులు సభ వేదిక వద్దకు వచ్చిన సమయంలో ఇరు పార్టీల కార్యకర్తలు నినాదాలు చేయడంలో గందరగోళం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే హరీశ్ రావు, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్ రావు ఇరు పార్టీల కార్యకర్తలకు నచ్చజెప్పారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తున్న వారిని పోలీసులు సభ వేదిక వద్ద నుంచి బయటకు తీసుకెళ్లారు.

అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి

- **కరీంనగర్‌లో ఉగాది వేడుకల్లో మంత్రి పొన్నం ప్రభాకర్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, మార్చి 19: శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది సందర్భంగా కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఉగాది వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేష్, కరీంనగర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అంజన్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు పుష్కలంగా పండాలని, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజాపాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా ప్రజలకు చేరాలని దేవుని ప్రార్థించారు. ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు. జాతీయ గీతం పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం చూపాల్సిన బాధ్యత ఉందని, ఏవైనా అభ్యంతరాలు ఉంటే శాసనసభ స్పీకర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. రాజకీయ వ్యాఖ్యల సందర్భంగా మహాత్మా గాంధీ వారసత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలను ఖండిస్తూ, దేశ నిర్మాణంలో జవహర్‌లాల్ నెహ్రూ నుంచి మన్మోహన్ సింగ్ వరకు చేసిన సంస్కరణలు కీలకమని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై విమర్శలు చేస్తూ, తెలంగాణపై బీజేపీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో కాంగ్రెస్ పాత్రను గుర్తు చేశారు. మూసీ అభివృద్ధిపై మాట్లాడుతూ, సబర్మతి తరహాలో అభివృద్ధి చేయడంలో తప్పులేదని, అయితే నిర్వాసితులకు పూర్తి న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్ట్ ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. పేదలకు ఉపాధి అవకాశాలు కల్పించేలా మూసీ అభివృద్ధి చేస్తామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సహకరించాలని మంత్రి పిలుపునిచ్చారు

హుస్నాబాద్లో మంత్రి
పొన్నం పంచాంగ శ్రవణం

ఉగాది పచ్చడి లోని షడ్రుచుల లాగా శ్రీ పరాభవ తెలుగు నూతన సంవత్సరంలో ప్రజలందరి జీవితాలు ముందుకు సాగాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాంగ శ్రవణం, పూజా కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ నూతన తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. పర అంటే శివుడు అని భవ అంటే పార్వతి అమ్మవారని, బోలా శంకరుడుగా ఎప్పుడూ అందరిని ఆశీర్వదించే శివపార్వతుల సంవత్సరంగా ఈ సంవత్సరం ఉంటుందన్నారు. తనతో సహా అందరూ కోపం, అహంకారం, ఆవేశం, ఆక్రోష లను ఇతరుల మీద తొలగించుకొని సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, విపక్షాలు, అందరూ సహకరించాలన్నారు.

ఇంధన క్షేత్రాలపై ఇరాన్ దాడులు

- **సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్స్ పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారం**
- **ఖతార్, యూఏఈ, ఇజ్రాయెల్ పై ఇరాన్ క్షిపణి దాడులు**
- **ఇరాన్ చర్యలపై ఖతార్ ఆగ్రహం**
- **వినాశనాన్ని కోరుకోవడం లేదు: ట్రంప్**
- **హర్మూజ్ వల్ల నాటో దేశాలకే ప్రయోజనం: వైట్ హౌస్**
- **ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానితో మోడీ చర్చలు**

ప్రతిపక్షం నేషనల్ డెస్క్

పశ్చిమాసియాలో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా మారుతున్నాయి. సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్స్‌పై ఇజ్రాయెల్ దాడులకు ప్రతీకారంగా ఇరాన్ తీవ్రంగా ప్రతిస్పందించింది. ఖతార్, యూఏఈల్లోని అమెరికా నిర్వహిస్తున్న ఇంధన క్షేత్రాలపై ఇరాన్ క్షిపణి దాడులు చేసింది. ఖతార్ ఆర్థికవ్యవస్థకు పునాది అయిన రస్‌లాఫాన్ ఎల్ఎన్జీ కేంద్రంపై జరిగిన దాడిలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఖతార్ ఎనర్జీ ధృవీకరించింది. ఇరాన్ రాయబారులు 24 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఖతార్ ప్రభుత్వం ఆదేశించింది. మరోవైపు ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. రస్ లాఫాన్ దాడి తరువాత తెల్లవారుజామున పలు లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ కేంద్రాలు కూడా క్షిపణి దాడులకు గురయ్యాయని ఆ దేశ ప్రభుత్వ రంగ సంస్థ ఖతార్ ఎనర్జీ తెలిపింది. దీంతో భారీ అగ్ని ప్రమాదాలు సంభవించి మరింత నష్టం వాటిల్లిందని పేర్కొంది. అగ్నిప్రమాదాలపై అత్యవసర సిబ్బంది వెంటనే స్పందించి మంటలను అదుపులోకి తెచ్చారు. అధికారుల ప్రకారం, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. మూడు అగ్నిప్రమాదాల్లో రెండింటిని పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారని ఖతార్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకారం తెలిపింది. ఇంకా కూలింగ్, భద్రత చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొంది.

ఇరాన్ చర్యలపై ఖతార్ ఆగ్రహం

ఇరాన్ చర్యలపై ఖతార్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇరాన్ దాడులను ఖతార్ తీవ్రంగా ఖండించింది. పౌర ప్రాంతాలు, కీలక మౌలిక సదుపాయాలపై దాడులు అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే ఇలాంటి దాడులు ఉద్రిక్తతలను మరింత పెంచుతాయని ఖతార్ హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఘటనల నేపథ్యంలో ఖతార్ ప్రభుత్వం ఇరాన్ ఎంబసీలోని సైనిక, భద్రతా అధికారులను పర్సోనా నాన్ గ్రాటాగా ప్రకటించింది. వారిని 24 గంటల్లోగా దేశం విడిచిపోవాలని ఆదేశించింది.

యూఏఈలోని గ్యాస్‌క్షేత్రాలపై డ్రోన్‌దాడి

అటు యూఏఈలోని హబ్షన్, బాబ్ గ్యాస్ క్షేత్రాలు సైతం ఇరాన్ డ్రోన్ దాడిలో దెబ్బతిన్నాయి. ప్రస్తుతం అక్కడ గ్యాస్ కార్యకలాపాల్ని నిలిపివేశారు. రియాద్‌కు సమీపంలోని రెండు చమురు శుద్ధి కేంద్రాలను ఇరాన్ డ్రోన్‌లు తాకినట్లు సౌదీ అరేబియా తెలిపింది. కువైట్ లోని ఓ అమెరికా ఎయిర్‌బేస్ కూడా దెబ్బతిన్నట్లు అక్కడి మీడియా తెలిపింది.

వినాశనాన్ని కోరుకోవడం లేదు: ట్రంప్

మరోవైపు ఇరాన్‌దాడులపై డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా స్పందించారు. మళ్లీ ఇలాంటి దాడులు జరిగితే ఇరాన్‌పై గతంలో మునుపెన్నడూ చూడనంత శక్తితో దాడి చేస్తామని హెచ్చరించారు. పార్స్ గ్యాస్ క్షేత్రం మొత్తాన్ని విధ్వంసం చేస్తామని పేర్కొన్నారు. ఇరాన్ శాంతియుతంగా ఉంటే, ఇకపై సౌత్ పార్స్ మీద ఎటువంటి దాడులు జరగవని ఆయన హామీ ఇచ్చారు. తాను ఆ స్థాయి హింస, వినాశనాన్ని కోరుకోవడం లేదని పేర్కొన్నారు. సౌత్ పార్స్ గ్యాస్ ఫీల్డ్‌పై ఇజ్రాయెల్ కోపంతో దాడి చేసినదని, దాని గురించి అమెరికాకు ముందుగా సమాచారం ఇవ్వలేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ చమురు, గ్యాస్ కేంద్రాలపై మరిన్ని దాడులు చేయవద్దని ఇజ్రాయెల్‌తో పాటు తమ సైన్యానికి ట్రంప్ స్పష్టంచేశారు. ఇరాన్ ఇంధన నిల్వలపై దాడులు చేస్తే ప్రపంచవ్యాప్తంగా ధరలు విపరీతంగా పెరిగే అవకాశం ఉండటాన్ని దృష్టిలో ఉంచుకుని ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

హర్మూజ్ వల్ల నాటో దేశాలకే ప్రయోజనం: వైట్ హౌస్

ప్రపంచ ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన 'హర్మూజ్ జలసంధి'పై వైట్ హౌస్ కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ జలసంధి తెరుచుకోవడం వల్ల అమెరికా కంటే నాటో మిత్రదేశాలకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని, కాబట్టి ఈ విషయంలో ఐరోపా దేశాలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు వైట్‌హౌస్‌లో ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంధన రంగంలో అమెరికా సాధించిన ప్రగతిని వివరించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరించిన ఇంధన విధానాల వల్ల అమెరికా ప్రస్తుతం చమురు నిల్వల విషయంలో ఎవరిపైనా ఆధారపడాల్సిన అవసరం లేదని కరోలిన్ లీవిట్ పేర్కొన్నారు. ఒకప్పుడు అమెరికా చమురు దిగుమతులపై ఆధారపడేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. చమురును ఎగుమతి చేసే స్థాయికి అమెరికా ఎదిగిందన్నారు.

ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానితో మోడీ చర్చలు

పశ్చిమాసియాలో యుద్ధం మహోగ్రరూపం దాల్చిన వేళ ప్రధాని నరేంద్ర మోదీ ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానమంత్రితో ఫోన్‌లో చర్చలు జరిపారు. ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్‌తో మొదట మాట్లాడిన మోదీ, పశ్చిమాసియాలో తాజా పరిస్థితులపై చర్చించారు. తక్షణమే ఉద్రిక్తతలు తగ్గించాల్సిన ఆవశ్యకతపై ఇరువురు నేతలు సమాలోచనలు జరిపారు. హర్మూజ్ జలసంధి నుంచి స్వేచ్ఛాయుత నౌకాయానానికి తీసుకోవాల్సిన చర్యలపైనా సంప్రదింపులు జరిపారు. పశ్చిమాసియాల ఉద్రిక్తతలను తగ్గించడానికి, శాంతిని పునరుద్ధరించడానికి ఉమ్మడి కృషి అవసరమని హైతమ్ బిన్ తారిఖ్ అంగీకరించినట్లు ప్రధాని మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. ఒమన్‌పై ఇరాన్ దాడులను ఖండించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ పోస్టులో వివరించారు. తర్వాత మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతోనూ ప్రధాని మోదీ చర్చించారు.

ఇరాన్ న్యూక్లియర్ వెపన్ తయారీని నిషేధిస్తూ గతంలో జారీ చేసిన 'ఫత్వా'ను ఉల్లంఘించినట్లు ఎటువంటి ఆధారాలు లేవు. ఖమేనీ హత్య ఇరాన్‌ను మరింత రెచ్చగొట్టింది. ఈ దాడుల వల్ల శాంతి నెలకొనే అవకాశం లేదు.
- యూఎస్ మాజీ కౌంటర్ టెర్రరిజం చీఫ్ కెంట్

వేడెక్కిన వందేమాతరం వివాదం

- **పొన్నం, బండి సంజయ్ మధ్య మాటల తూటాలు**
- **దేశంలో ఉండాలంటే వందేమాతరం ఆలపించాల్సిందే**
- **రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోంది : బండి సంజయ్**
- **గాంధీ వారసులెవరో.. గాడ్సే వారసులెవరో అందరికీ తెలుసు**
- **గాంధీ స్మృతి వనం పెడతామంటే అడ్డుకుంటున్నారు**
- **రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, మార్చి 19: అసెంబ్లీ సమావేశాలు నాయకుల మాటల యుద్ధంతో వాడీవేడిగా సాగుతున్నాయి. ఇటు కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మూసీ ప్రాజెక్టు, ఆరు గ్యారెంటీలు తదితర అంశాలపై మాటల యుద్ధం కొనసాగుతుంది. మరోవైపు అసెంబ్లీలో వందేమాతర గీతం ఆలపిస్తున్న సమయంలో ఎంఐఎం వాకౌట్ చేయడంపై కేంద్ర మంత్రి బండి సంజయ్ ఘాటుగా స్పందించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మధ్య ఘాటు విమర్శలు చెలరేగాయి. అసెంబ్లీలో ఎంఐఎం సభ్యుల వాకౌట్ ఈ వివాదానికి కేంద్రబిందువైంది. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్పందిస్తూ, "ఈ దేశంలో ఉండాలంటే వందేమాతరం ఆలపించాల్సిందే" అని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలో ఉంటే ఎంఐఎం నేతలతో వందేమాతరం పాడించేవాళ్లమని, వ్యతిరేకిస్తే చట్టపరమైన చర్యలు తీసుకునేవాళ్లమని హెచ్చరించారు. వాకౌట్‌ను రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివర్ణించిన ఆయన, అసెంబ్లీలో జరిగిన ఘటనపై స్పీకర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు.

గాడ్సే వారసులెవరో దేశానికి తెలిసిందే..

బండి సంజయ్‌ఆరోపణలకు కౌంటర్‌గా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. వందేమాతరం గీతాన్ని ఎవరైనా గౌరవించాల్సిందేనని, ఆ అంశంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి వ్యాఖ్యలు అనవసర రాజకీయ దూషణలని విమర్శించారు. "గాంధీ వారసులెవరో, గాడ్సే వారసులెవరో దేశానికి తెలిసిందే" అంటూ బీజేపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 'గాంధీకి సంబంధించిన స్మృతి వనం పెడతామంటే విమర్శ చేస్తూ ఆటంకాలు కలిగిస్తున్నారు. ఆంగ్లేయులకు వ్యతిరేకంగా స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన జాతిపిత గాంధీజీ నీ స్వాతంత్రం వచ్చిన కొద్దిరోజుల్లోనే తుపాకి పెట్టి కాల్చి చంపిన గాడ్సే వారసులు వాళ్ళు.. గాడ్సే వారసులుగా విభజించు పాలించు అనే మతతత్వ వాదానికి ప్రతిజ్ఞ చేస్తున్నారు.' అని అన్నారు. దేశం విద్య, వైద్యం రంగాల్లో అభివృద్ధి సాధించడానికి మహాత్మా గాంధీ, పీవీ నరసింహారావు చూపిన మార్గమే కారణమని గుర్తుచేశారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ప్రజల ఆశయాలను కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. కరీంనగర్‌లో మొదలైన ఈ రాజకీయ పోరు ఇప్పుడు రాష్ట్రాన్ని దాటి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

ఆ వార్నింగ్.. కాంగ్రెస్ సీనియర్లకే

- **సీఎం భాషపై ప్రజల్లో అసహనం పెరుగుతోంది**
- **అదే తరహా భాషను బీఆర్ఎస్ నేతలూ ఉపయోగిస్తున్నారు**
- **పునరావాసం కల్పించిన తర్వాతే మూసీ పనులు చేపట్టాలి**
- **సీఎం వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి బండి ఫైర్**

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, మార్చి 19: తెలంగాణ రాజకీయాల్లో సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. తాను " తొక్కుకుంటూ వచ్చా.. తొక్కుకుంటూ పోతా" అన్న వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ సీనియర్ నేతలను లక్ష్యంగా చేసుకుని ఇచ్చిన వార్నింగ్‌లా ఉన్నాయని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషపై ప్రజల్లో అసహనం పెరుగుతోందని, అదే తరహా భాషను భారత రాష్ట్ర సమితి నేతలు కూడా ఉపయోగిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని, 6 గ్యారంటీల అమలుపై బీఆర్ఎస్ ప్రశ్నించదని, అవినీతి ఆరోపణలపై కాంగ్రెస్ చర్యలు తీసుకోదని ఆరోపించారు. అసెంబ్లీలో "వందేమాతరం" బహిష్కరణపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఐఎం సభ్యులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. స్పీకర్, సీఎం స్పందించకపోవడం శాసనసభ గౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. బీజేపీ అధికారంలో ఉంటే కఠిన చర్యలు తీసుకునేవాళ్లమని హెచ్చరించారు. రైతు భరోసా అంశంపై కూడా ప్రభుత్వం మీద విమర్శలు గుప్పించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు భారీగా బకాయిలు పెట్టిందని, వెంటనే వాటిని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు తమ హక్కుల కోసం ప్రజాప్రతినిధులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మూసీ ప్రక్షాళనపై మాట్లాడుతూ, బీజేపీకి వ్యతిరేకత లేదని, కానీ పేదల ఇళ్లను కూల్చకుండా పునరావాసం కల్పించిన తర్వాతే పనులు చేపట్టాలని సూచించారు. గుజరాత్‌లోని సబర్మతి నది తరహాలో అభివృద్ధి చేయాలని అభిప్రాయపడ్డారు. కరీంనగర్‌లో ఉగాది వేడుకల్లో పాల్గొన్న బండి సంజయ్, కొత్త సంవత్సరం విజయానికి పునాది కావాలని ఆకాంక్షించారు.

ఓపెన్ వాయిస్

అణుయుద్ధానికి బాటలు వేస్తున్న అహం

అమెరికా ఆధిపత్యానికి లొంగని ఇరాన్ పై ట్రంప్ అణుయుద్ధానికి సిద్ధంగా ఉన్నట్టు వెలువడుతున్న వార్తలు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు ఇజ్రాయిల్ తో కలిసి "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" అంటూ ఇరాన్ పై ఎందుకు దాడికి పాల్పడ్డారు? ఇరాన్ ను తక్కువగా అంచనా వేసిన ట్రంప్ భారీగా యుద్ధం మూల్యం ఎందుకు చెల్లించుకోవలసి వస్తుంది? ఇరాన్ పై ఆధిపత్యం చెలాయించాలన్న దుగ్ధతో తేనె తుట్టను కదిపిన ట్రంప్ ప్రస్తుతం ఏమీ చేయాలో అర్థం కాక సతమతమవుతున్నాడు? ఇరాన్ తో పోరు వెనిజువెలా మాదిరిగా క్షణాల్లో తేలిపోతుందని సంబర పడి, యుద్ధ విమానాలతో, అధునాతన మిస్సైళ్ళతో టెహ్రాన్ పై విరుచుకు పడిన ట్రంప్ మరియు బెంజిమన్ నెతన్యాహు లకు రోజుల గడిచే కొద్దీ తత్వం బోధపడుతున్న సూచనలు కానవస్తున్నాయి. ఇరాన్ లో ఖొమేనీ ని అంతం చేసి యుద్ధం లో ఏకపక్షం విజయం సాధించాలని ఉవ్విళ్ళూరిన అమెరికా కు శృంగభంగమే జరిగిందని చెప్పక తప్పదు. ఖొమేనీ ని అంతమొందించినప్పుడు వీధుల్లోకి వచ్చి నృత్యం చేసిన ఇరాన్ ప్రజలు,మహిళల్లో ప్రస్తుతం స్థబ్దత ఆవహించింది. అమెరికా తమ దేశంలోకి వచ్చి ఖొమేనీ పాలన అంతమొందించి,తమకు స్వేచ్ఛను ప్రసాదించాలని వేడుకున్న ప్రజలు నేడెందుకు మౌనం పాటిస్తున్నారు? అమెరికా భూతం తమ దేశాన్ని మింగేస్తుందనే భావన ప్రజల్లో కలిగిందా? ఈ యుద్ధంలో అమెరికా ఓడిపోతే పాలకులు తమకు కఠిన దండన విధిస్తారని ప్రజలు భయపడ్డారా? అసలు ఇరాన్ లో ఏం జరుగుతుంది? ప్రగల్భాలు పలికిన ట్రంప్ లో ఎందుకు వెన్నులో వణుకు పుడుతున్నది? యుద్ధం ఆరంభించిన మొదటి వారం రోజుల్లోనే అమెరికా 11 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేసినట్టు కొన్ని గణాంకాలు సూచిస్తున్నాయి. యుద్ధాల పేరుతో అమెరికాను ఇంకా ఆర్థికంగా దివాళా తీస్తున్న ట్రంప్ పట్ల స్వదేశంలోనే తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. స్వంత రిపబ్లికన్ పార్టీ సభ్యులే ట్రంప్ పాలన పట్ల విసుగెత్తి పోతున్నారు. ఇప్పటికే ఉక్రెయిన్ రష్యా యుద్ధంలో ఉక్రెయిన్ కు భారీ ఆయుధ సహాయం చేసి, ఆర్థికంగా అతలాకుతలమైన అమెరికా కు మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా ఇరాన్ పై చేస్తున్న యుద్ధం వలన తీవ్రమైన ఆర్థిక భారం పడుతున్నది. అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి పోయాయి. ద్రవ్యోల్బణం పెరిగి పోతున్నది. నిరుద్యోగ సమస్య పెరిగింది. పైగా ట్రంప్ రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత టారిఫ్ ల పేరుతో ప్రపంచ దేశాలపై ట్రేడ్ వార్ సాగించి, మిత్ర దేశాలను సైతం దూరం చేసుకున్నారు. యూరోపియన్ యూనియన్ దేశాలు దాదాపుగా ట్రంప్ కు దూరమైనాయి. అమెరికా తో సన్నిహితంగా మెలగిన గల్ఫ్ దేశాలు ఇరాన్ సాగిస్తున్న విధ్వంసానికి భీతిల్లి చేష్టలుడిగి చూస్తున్నాయి. అహంతో చెలరేగి పోయి, ఆధిపత్య భావజాలంతో కన్నూ మిన్నూ కానక దుర్భాషలాడుతూ, పరాయి దేశాలను పరాభవించిన ట్రంప్ కు ప్రస్తుతం పట్టపగలే చుక్కలు కనబడుతున్నాయి.పశ్చిమాసియాలో పరిస్థితులు యావత్ ప్రపంచ ప్రజలకు ప్రాణ సంకటంలా మారిపోయాయి. అమెరికా ఇజ్రాయిల్ దేశాల రణ వ్యూహం ముందు ఇరాన్ మోకరిల్లక తప్పదని మొదట్లో అంతా భావించారు. ఇరాన్ పాలకులపై తిరగబడాలని,నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే అవకాశం కోల్పోరాదని ఇరాన్ ప్రజలకు విజ్ఞప్తి చేసిన ట్రంప్ నేడు ఇరాన్ ప్రజలు కలసి రాకపోవడంతో, ఇరాన్ లో సివిల్ వార్ ఆశలు ఆవిరికావడంతో అమెరికా ఆశలు కూడా అడియాసలయ్యాయి. ఖమేనీ నియంతృత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన ఇరాన్ ప్రజలు మొదట్లో అమెరికా రాకను స్వాగతించినా ప్రస్తుతం అమెరికాను సమర్థించే స్థితిలో లేరు. వెనిజువెలాలో మాదిరిగా ఇరాన్ ను కూడా తమ చెప్పు చేతుల్లోకి తీసుకోవాలన్న ట్రంప్ కు పరిస్థితులు అడ్డం తిరిగాయి. గతంలో ఆఫ్ఘనిస్తాన్ లో తాలిబాన్ ప్రభుత్వాన్ని గద్దె దించి,కొన్నేళ్ళు కాబూల్ లో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అమెరికా అనేక మంది తమ సైనికుల మరణంతో, ఆర్థికభారంతో ఆఫ్ఘన్ ను తిరిగి తాలిబాన్లకే విడిచి పెట్టి పోయింది. రష్యా ఉక్రెయిన్ల మధ్య చిచ్చుబెట్టి శాంతి వచనాలు పలికిన ట్రంప్ ఇరాన్ పై యుద్ధ భేరీ మోగించి తన నిజ స్వరూపాన్ని బహిర్గతం చేసుకున్నారు. అమెరికా కాంగ్రెస్ లోని ఉభయ సభలకు త్వరలో జరగబోయే మధ్యంతర ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, రాజకీయ లబ్ధి కోసం ఇరాన్ పై యుద్ధాన్ని ప్రకటించినా, ప్రస్తుత పరిణామాలు ట్రంప్ పార్టీ ఓటమికి తెరదీసినట్టు అవగతమవుతున్నది. గతంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ పై దాడి జరిగిన నేపథ్యంలో అప్పటి అధ్యక్షుడు తీసుకున్న చర్యలకు మద్దతుగా అమెరికా ప్రజలు పాలక పక్షాన్ని మధ్యంతర ఎన్నికల్లో గెలిపించారు.ఇప్పుడు కూడా అమెరికా ప్రజల్లో ఇదే రకమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే క్రమంలోనే ట్రంప్ ఇరాన్ పై యుద్ధభేరి మ్రోగించారని అర్థమవుతున్నది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
20.03.2026

ఉనికిని కోల్పోతున్న పిచ్చుకలు

పక్షుల సంరక్షణ సంస్థ అయిన "నేచర్ ఫరెవర్" (Nature Forever) ద్వారా 2010లో, "ప్రపంచ పిచ్చుకల దినోత్సవం" ప్రారంభించబడింది. వాతావరణ మార్పు మరియు వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ నేపథ్యంలో క్షీణిస్తున్న పిచ్చుకల జనాభా గురించి అవగాహన కల్పించడం మరియు పర్యావరణ సమతుల్యత కోసం ఈ ముఖ్యమైన పక్షులను సంరక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పడం దీని ముఖ్య ఉద్దేశం. ప్రతి సంవత్సరం మార్చి 20న పాటించే ఈ అంతర్జాతీయ కార్యక్రమం, ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాలలో నిర్వహించబడుతుంది. పిచ్చుకలను రక్షించడం మరియు వాటి సంఖ్య క్షీణించకుండా అడ్డుకోవడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యం. ఈ కార్యక్రమం ఐరోపా మరియు దక్షిణాసియాలో గణనీయమైన ప్రజాదరణను పొందింది. భారతదేశం మరియు ఫ్రాన్స్‌లలో దీని ఉనికి బలంగా ఉన్నప్పటికీ, ఈ కార్యక్రమాన్ని ఆఫ్రికాలో ఎక్కువగా పాటిస్తుండగా ఇది ఉత్తర మరియు దక్షిణ అమెరికా అంతటా విస్తరిస్తోంది.

యేచన్ చంద్ర శేఖర్
8885050822

ప్రపంచవ్యాప్తంగా అంతరించిపోతున్న ఊర పిచ్చుకలు ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్సర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్) ద్వారా "అతి తక్కువ ఆందోళనకరమైన" జాబితాలో చేర్చబడ్డాయి. ప్రపంచంలోని అత్యంత మరియు విస్తృతంగా ఉనికి గల అడవి పక్షులలో ఒకటిగా మిగిలిపోయినప్పటికీ, అనేక పట్టణ మరియు శివారు ప్రాంతాలలో వాటి జనాభా గణనీయమైన, వేగవంతమైన క్షీణతను ఎదుర్కొంటోంది. ఒకప్పుడు పట్టణ ప్రాంతాల్లో సర్వవ్యాప్తంగా ఉన్న పిచ్చుకలు ఇప్పుడు చూద్దామన్నా మచ్చుకు కానరావడం లేదు. అంతేకాదు, నేటి తరం పిల్లలకు పుస్తకాలు మరియు జంతు ప్రదర్శన శాలలో (జూ) పిచ్చుకలను చూపించాల్సిన అగత్యం ఏర్పడిందంటే అతిశయోక్తి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ వాటి సంఖ్య ఎక్కువగానే ఉన్నప్పటికీ, అధ్యయనాలు నిర్దిష్ట ప్రాంతాలలో భారీ తగ్గుదలని నమోదు చేశాయి. 1966 నుండి అమెరికాలో 80 శాతం తగ్గుదల ఉన్నట్లు అంచనా. పట్టణీకరణ మరియు అభివృద్ధి చెందుతున్న సమాజం నేపథ్యంలో సాధారణ పెంకుటిల్లు, తాటాకు గుడిసెలు లాంటి పురాతన ఆవాసాల స్థానంలో ఆధునిక సిమెంట్ భవనాల నిర్మాణం కారణంగా గూడు కట్టుకునే ప్రదేశాలకు అవకాశాలు లేకపోవడం, ఆహార లభ్యత తగ్గడం, మోతాదుకు మించి పురుగుమందుల వాడకం, పట్టణ ప్రాంతాల్లో నానాటికీ పెరిగిపోతున్న శబ్ద కాలుష్యం, సెల్ ఫోన్ టవర్లు వంటి అంశాలు పిచ్చుకల సంఖ్య తగ్గడానికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. మొబైల్ ఫోన్ టవర్ల నుండి వచ్చే విద్యుదయస్కాంత వికిరణం (ఎలెక్ట్రో మ్యాగ్నెటిక్ రేడియేషన్) ఊర పిచ్చుకల జనాభాను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. దీర్ఘకాలం పాటు అధికస్థాయి రేడియో ఫ్రీక్వెన్సీ రేడియేషన్ (ఆర్ఎఫ్ఆర్)కు గురికావడం వలన పునరుత్పత్తి అవకాశాలు క్షీణించడంతో పాటు గుడ్లు మరియు పిండాలపై ప్రతికూల ప్రభావం కలిగిస్తాయి. విద్యుదయస్కాంత క్షేత్రాలు పిచ్చుకల పయనాన్ని మరియు గూడు కట్టుకునే ప్రవర్తనకు అంతరాయం కలిగిస్తాయని, దీని కారణంగా అధిక రేడియేషన్ ఉన్న ప్రాంతాలలో ఇవి నివసించే అవకాశం తక్కువగా ఉంటుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి.

మొహమ్మద్ దిలావర్ చొరవ:
నేచర్ ఫరెవర్ సొసైటీ ఆఫ్ ఇండియా ఫ్రాన్స్‌కు చెందిన ఎకోసిస్ యాక్షన్ ఫౌండేషన్‌తో కలిసి ఈ చొరవను ప్రారంభించింది. ఈ సంస్థ స్థాపన వెనుక వాతావరణ పరిరక్షకుడు మరియు పక్షి ప్రేమికుడు మొహమ్మద్ దిలావర్ యొక్క అంకితభావం ఉంది. 2008లో, ది టైమ్ మ్యాగజైన్ అతన్ని "పర్యావరణ హీరోలలో" ఒకరిగా పేర్కొంది. మహమ్మద్ దిలావర్ తన బాల్యం ఎక్కువగా నాసిక్‌లోని అమ్మమ్మ వాళ్ళింట్లో గడిచిందని, అక్కడ వారి ఇంటి చుట్టూ

వందలాది ఊర పిచ్చుకలను (పాసర్ డొమెస్టికస్) చూసేవాడినని అక్కడ పిచ్చుకలు మరియు రాబందులు సాధారణ సందర్భకులుగా ఉండేవని ఆయన గుర్తుచేసుకున్నాడు. పిచ్చుకలు టెలివిజన్ యాంటెన్నాల పైన, ఇంటి వెలుపల విద్యుత్ తీగలపై విహరిస్తూ ఇంటి లోపల కూడా గూళ్ళు నిర్మించుకునేవి అని ఆయన తెలిపాడు. 2005లో, అతను నాసిక్‌లోని ఆర్ వై కె కాలేజ్ ఆఫ్ సైన్స్‌లో పర్యావరణ అవగాహన విభాగానికి అధిపతిగా పనిచేస్తున్న సమయంలో, భారతదేశంలో రాబందులు విపత్కర క్షీణతను చూస్తున్న సమయంలోనే, యుకెలో పిచ్చుకల క్షీణతపై ఒక విద్యార్థి రూపొందించిన ప్రాజెక్ట్‌ను చూసినప్పుడు అది అతన్ని నిశితంగా ఆలోచింపజేసింది. ఆ ప్రాజెక్ట్‌ను చదివిన అతడు భారతదేశంలో రాబందులు కూడా అదే దుస్థితిలో పయనిస్తున్నాయని భావించాడు. దిలావర్ పిచ్చుకలను సంరక్షించడానికి నిధులు సేకరించే దిశగా పని చేయడం ప్రారంభించాడు. అయితే, మొదట్లో ప్రజలు పిచ్చుకల వలన పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి ప్రయోజనం ఉండదని భావించారు. కానీ ఇది ఎంతమాత్రం నిజం కాదు. భారతదేశంలో పులుల వంటి వన్యప్రాణుల సంరక్షణ పట్ల అపారమైన జ్ఞానం మరియు ఆసక్తి ఉన్నప్పటికీ, సాధారణ ఊర పిచ్చుకలను సంరక్షించడంపై ప్రజల్లో పెద్దగా ఆసక్తి లేదు. నగరాల్లో మునుపటిలాగా ఊర పిచ్చుకల ఉనికి లేదని వాటి జనాభా వేగంగా క్షీణిస్తున్నదని అతను గమనించినప్పటికీ, వాటి జనాభాపై ఎటువంటి చారిత్రక గణాంకాలు అందుబాటులో లేవన్న విషయాన్ని గ్రహించాడు. అంతేకాదు, పిచ్చుకలు అంతరించిపోతున్న జాతి కాదు కాబట్టి వాటిపై ఆసక్తి మరియు క్షీణతను అరికట్టేందుకు అవసరమైన కృషి జరగడం లేదు అని ఆయన అభిప్రాయం. పిచ్చుకల గురించి వీలైనంత ఎక్కువ సమాచారాన్ని సేకరించడం మరియు మానవ నిర్లక్ష్యానికి బలైపోతున్న ఈ పక్షి గురించి ప్రజలతో పాటు విధాన రూపకర్తలలో అవగాహన కల్పించాలని దిలావర్ సంకల్పించాడు. 2005లో, దిలావర్ సాధారణ పక్షి జాతులను సంరక్షించే నేచర్ ఫరెవర్ సొసైటీ (ఎన్ఎఫ్ఎస్) అనే లాభాపేక్షలేని సంస్థను ప్రారంభించాడు. దిలావర్ మరియు అతని సంస్థ పిచ్చుకల పై పరిశోధన చేయడమే కాకుండా, పౌరులు ఆ పక్షిని జాగ్రత్తగా చూసుకోవాలని ప్రోత్సహించడానికి ప్రయత్నించారు.

పిచ్చుకల వల్ల ఒనగూరే లాభాలు:
పిచ్చుకలు వివిధ రకాల విత్తనాలను వ్యాప్తి చేయడం ద్వారా జీవవైవిధ్యానికి ఎంతగానో సహాయపడతాయి. పిచ్చుకలు మన పర్యావరణ వ్యవస్థలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అవి ఎక్కువగా తిస్టిల్, కలుపు మరియు పొద్దుతిరుగుడు విత్తనాలను తింటాయి. అంతేకాకుండా, కొన్నిసార్లు పండ్లు మరియు బెర్రీలను కూడా తింటాయి. అవి చెట్ల నుండి ఆహారం తీసుకున్నప్పుడు, అందులోని విత్తనాలను చెట్టు నుండి దూరంగా ఉండే ప్రదేశాలలో కూడా వెదజల్లుతాయి. ఈ చర్య ద్వారా, పిచ్చుకలు అనేక చెట్లు, మొక్కల వ్యాప్తి మరియు మనుగడకు మాత్రమే కాక మన పర్యావరణ వ్యవస్థ యొక్క పునరుత్పత్తికి సహాయపడతాయి. కానీ ఆవాస నష్టం, పట్టణీకరణ మరియు వ్యవసాయంలో మార్పుల కారణంగా వాటి సంఖ్య గణనీయంగా అంతరించిపోతోంది. పెరుగుతున్న శబ్ద కాలుష్యం కారణంగా, అవి పట్టణ ప్రాంతాల నుండి దూరంగా తరలి వెళ్ళడంతో పట్టణ ప్రాంతాల్లో వాటి సంఖ్య ప్రమాదకర రీతిలో క్షీణిస్తోంది.

పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల సహకారాన్ని గుర్తించిన ఢిల్లీ మరియు బీహార్ రాష్ట్రాలు సాధారణ 'పిచ్చుక'ను తమ రాష్ట్ర పక్షిగా గుర్తించడం గమనార్హం. మానవజాతితో సహజీవనం చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తమ శక్తి కొద్దీ దోహదపడే హితైషులైన ఈ చిన్ని పిచ్చుకలను ఐయుసిఎన్ యొక్క "అతి తక్కువ ఆందోళనకరమైన" జాబితా నుండి "అంతరించిపోతున్న జాతి" జాబితాలోకి వెళ్ళకుండా చూసే బాధ్యత నాది, మీది, మనందరిది.

మార్చి 20 ప్రపంచ పిచ్చుకల దినోత్సవం
(వ్యాసకర్త మాజీ రాష్ట్ర కార్యదర్శి
ది భారత్ స్కౌట్స్ & గైడ్స్, తెలంగాణ)

తమిళనాట 'విజయ'మెవరిదో..?

అంబీర్ శ్రీకాంత్
8185968059

234 అసెంబ్లీ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీకి వచ్చే నెల 23న ఎన్నికలు జరగనున్నాయి. ఎలక్షన్ నగారా మోగిన వేళ ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతీ అంశం, ఘటనా ఘటనలపైన ఆసక్తి పెరుగుతున్నది. ముఖ్యంగా తన కెరీర్ అత్యంత ఉచ్ఛస్థితిలో ఉన్న సమయంలో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీహీరో ఇళయ దళపతి విజయ్.. రాజకీయ నిర్ణయాలపై రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతున్నది. సాధారణంగా రాజకీయాలు జీవిత మలిదశలో చేయడానికి పలువురు ఆసక్తి చూపుతుంటారు. కానీ, ఇటీవల కాలంలో ట్రెండ్ మారింది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో పలువురు నటులు సినీ రంగంలో అత్యంత ప్రజాదరణ పొంది స్టార్‌డం పీక్స్‌లో ఉన్న సమయంలోనే పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఆ కోవకు చెందిన నటుల జాబితాలోకి విజయ్ దళపతి చేరారు. దక్షిణభారతదేశంలో సినిమా, రాజకీయం వేర్వేరు అని చెప్పలేం. కరుణానిధి, అన్నాదురై, ఎంజీఆర్ వంటి వారు సినిమా రంగం నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి సక్సెస్ అయిన వారు కాగా, పలువురు రాజకీయాల్లో అంతగా ప్రభావం చూపలేకపోయారు. ఇక తెలుగునాట ఎన్టీరామారావు, చిరంజీవి, పవన్ కల్యాణ్ వంటి వారు ఉన్నారు. పవన్ కల్యాణ్ పార్టీ పెట్టి దాదాపు పదేండ్లు సంయమనంతో పట్టు వదలకుండా ప్రయత్నించి ఎన్డీయే కూటమిలో చేరి కొంత మేరకు సక్సెస్ అయ్యారు. అయితే పవన్ తరహా విజయం అయినా విజయ్ కూ సాధ్యమయ్యేనా? లేదా అంతకు మించి అన్నట్లుగా ఏకంగా ముఖ్యమంత్రి పీఠంపైనే విజయ్ తొలి ఎన్నికల బరిలోనే నెగ్గి కూర్చోగలరా? అనే విషయమై ప్రస్తుతం పొలిటికల్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తున్నది.

ఓట్ల చీలికతో ఎవరికి లాభం?
ద్రవిడ అస్తిత్వ పునాదిగా తమిళనాట రాజకీయాలు సాగుతుంటాయి. ఇక్కడ బలమైన పార్టీలుగా డీఎంకే, ఏఐఏడీఎంకే ఉన్నాయి. ఏఐఏడీఎంకే ప్రజాక్షేత్రంలో కొంత బలహీనపడినట్లు కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే సైద్ధాంతికంగా బీజేపీని, రాష్ట్రంలో డీఎంకేను ఎదుర్కొంటామనే వైఖరిని తీసుకున్న తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధినేత విజయ్.. ఏ మేరకు ప్రభావం చూపుతారనేది కీలకమే. అయితే, ఆయనతో పొత్తుకు కాంగ్రెస్ తొలుత ప్రయత్నించినట్లు వార్తలొచ్చాయి. కానీ, తమిళనాట అధికార డీఎంకేతో కాంగ్రెస్ పొత్తులో ఉన్న క్రమంలో ప్రస్తుత రాజకీయ వర్గాల చర్చ ప్రకారం.. బీజేపీ విజయ్‌కి డిప్యూటీ సీఎం ఆఫర్ ఇచ్చినట్లు

తెలుస్తున్నది. ఈ రకంగా తొలిసారి ఎన్నికల బరిలోకి దిగిన విజయ్‌పైన పొలిటికల్‌గా బోలెడన్ని స్పెక్యులేషన్స్ జరుగుతున్నాయి. అయితే, విజయ్‌కి తమిళనాట ఉన్న క్రేజ్, ఫ్యాన్ ఫాలోయింగ్ ఓటు బ్యాంకుగా ఏ మేరకు మారనుంది? అది ఎవరి ఓట్లను చీల్చనుంది? అనే ప్రశ్నలకు సమాధానం ఎవరి అంచనాకు అందిన మేరకు వారు వ్యూహాలు రచించుకుంటున్నారు. దక్షిణ భారతాన కర్ణాటక మినహా మిగతా చోట్ల విస్తరణకు ఆపసోపాలు పడుతున్న బీజేపీ విజయ్‌తో పొత్తుకు ప్రతిపాదనలు పంపుతున్నట్లున్నది. ఇప్పటికే తమిళనాడు అధికార డీఎంకేపై, సీఎం స్టాలిన్‌పై విజయ్ ఘాటు విమర్శలు చేస్తున్నారు. తనకు, స్టాలిన్‌కు మధ్యే పోటీ ఉంటున్నదని పదే పదే బహిరంగ సభల్లో స్పష్టం చేస్తున్నారు. ఆ రకంగా అధికార పార్టీ వ్యతిరేక ఓట్లు తన వైపునకు తిప్పుకోవాలని విజయ్ చూస్తున్నారు. అదే జరిగితే అది.. ఏ మేరకు సీట్లు సాధించగలదు? విజయ్‌కి ముఖ్యమంత్రి సీటు సాధ్యం అవుతుందా? అనే ప్రశ్నలకు సమాధానాలు కాలం చెప్పేంత వరకు వెయిట్ చేయాల్సిందే. అశేష ప్రజాదరణ, అభిమానులు ఉన్న పవన్ కల్యాణ్ పోటీ చేసిన తొలిసారి రెండు చోట్ల ఓడిన సంగతి.. ద్వారా విజయ్ పాఠాలు నేర్చుకోవాల్సింది లేదా.? అనుభవాన్ని మించిన పాఠం లేదని తనూ ఎన్నికల బరిలో అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్నారా? తెలియదు. కానీ, ఇళయ దళపతి విజయ్ మాత్రం ఎన్నికల ముందే తమిళనాట 'గేమ్ చేంజర్'గా మారుతారనే డిస్కషన్‌కు కేంద్రబిందువుగా అయితే ఉండటం గమనార్హం. ఎన్నికలలో గణనీయమైన ప్రభావం విజయ్ చూపబోతున్నారనే దానికి సంకేతం ఆయనతో పొత్తుకు పార్టీల ప్రయత్నాలేనని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అధికార డీఎంకే పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను తన వైపునకు తిప్పుకుని ఓటు బ్యాంకుగా మార్చుకుని సత్తా చాటాలనే వ్యూహంతోనే విజయ్ అడుగులు ప్రస్తుతానికి కనబడుతున్నాయి. కానీ, పొత్తుల ముచ్చట పొద్దు పొడుపులా ఎప్పుడు మారుతుందనేది ఇప్పుడే చెప్పలేం. మొత్తానికి తమిళ ప్రజలు రాబోయే అసెంబ్లీ ఎన్నికలలో ఎవరికి మద్దతు తెలుపుతారో చూడాలి మరి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు)

ఈద్–ఉల్–ఫిత్ర్:

క్రమశిక్షణల సాక్షిగా.. మానవత్వపు పండగ!

ముహమ్మద్ ముజాహిద్
9640622076

నెల రోజుల పాటు సాగిన కఠోర దీక్ష.. ఆకలి విలువ తెలిసిన అంతరాత్మ.. అల్లాహ్ చింతనలో గడిచిన ప్రతి నిమిషం.. వీటన్నింటికీ ప్రతిరూపమే 'ఈద్-ఉల్ ఫిత్ర్'. రమజాన్ మాసపు పవిత్ర ఉపవాసాల (సౌమ్) ముగింపుగా, ఆకాశాన నెలవంక కనిపించగానే ముస్లిం లోకమంతా ఆధ్యాత్మికానందంలో మునిగిపోతుంది. ఇది కేవలం పండగ మాత్రమే కాదు; మనిషి తనపై తాను సాధించిన విజయం, సృష్టికర్త పట్ల చాటుకున్న కృతజ్ఞత.

ఆధ్యాత్మిక శిక్షణకు ముగింపు
ఇస్లాం ఐదు స్తంభాలలో ఉపవాసం అత్యంత కీలకమైనది. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు నీరు కూడా ముట్టకుండా గడపడం వెనుక ఉన్న ఉద్దేశం కేవలం దైవభక్తి మాత్రమే కాదు, ఎదుటివారి ఆకలిని అర్థం చేసుకోవడం కూడా. ఈ 30 రోజుల క్రమశిక్షణ మనిషిలో సహనం, వినమ్రత మరియు ఆత్మనియంత్రణను పెంచుతుంది. ఈ సాధన పూర్తయిన తదుపరి రోజే 'ఈద్' సంబరం మొదలవుతుంది.

చరిత్ర పుటల్లో ఈద్ ఆవిర్భావం
సుమారు 1400 ఏళ్ల క్రితం, ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలో ఈ పండుగ సంప్రదాయం మొదలైంది. క్రీ.శ. 610లో రమజాన్ మాసంలోనే దివ్య ఖుర్‌ఆన్ అవతరణ ప్రారంభమైంది. అరాచకాలు, అసమానతలు రాజ్యమేలుతున్న కాలంలో 'అందరూ సమానులే' అనే సందేశాన్ని చాటిన ఖుర్‌ఆన్ పట్ల కృతజ్ఞతగా ముస్లింలు ఉపవాసాలు పాటిస్తారు. మదీనాకు వలస వెళ్ళిన తర్వాత (హిజ్రా), విశ్వాసుల కష్టాలను మరచి సంతోషంగా గడపడానికి 624 క్రీ.శ.లో మొదటి సారి ఈద్ జరుపుకున్నారు.

మానవత్వమే అసలైన నైవేద్యం
ఈద్ వేడుకల్లో అత్యంత ఉదాత్తమైన ఘట్టం 'జకాత్ అల్‌ఫిత్ర్'. పండగ నమాజ్‌కు వెళ్ళే ముందే ప్రతి ముస్లిం తన సంపాదనలో కొంత భాగాన్ని పేదలకు దానంగా ఇవ్వాలి. ఇంట్లో పిండివంటలు ఘుమఘుమలాడుతున్నప్పుడు, పొరుగువాడు ఆకలితో ఉండకూడదనే ఇస్లాం సిద్ధాంతానికి ఇది నిదర్శనం. ధనిక, పేద అనే తేడా లేకుండా అందరూ కొత్త బట్టలు ధరించి, ఈద్గా మైదానాల్లో భుజం భుజం కలిపి నమాజ్ చేయడం సోదరభావానికి పరాకాష్ఠ.

వేడుకల వేళ.. 'ఈద్ ముబారక్'
పవిత్ర స్నానం ఆచరించి, అత్తరు పూసుకుని, తీపి పదార్థాలు సేవించి ముస్లిం సోదరులు ఈద్గాకు చేరుకుంటారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు కౌగిలించుకుంటూ చెప్పుకునే "ఈద్ ముబారక్" పలకరింపులో ఎంతో ఆప్యాయత దాగి ఉంటుంది. షీర్ ఖుర్మా తీపిని పంచుకుంటూ, పాత విభేదాలను విస్మరించి అందరూ ఒక్కటయ్యే మధుర క్షణాలివి.

ముగింపు
ఈద్-ఉల్-ఫిత్ర్ మనకు నేర్పే పాఠం ఒక్కటే—మంచిని పంచడం, చెడును విడనాడడం. రమజాన్ నెలలో నేర్చుకున్న క్రమశిక్షణ, దాతృత్వం కేవలం ఆ నెలకే పరిమితం కాకుండా ఏడాదంతా కొనసాగాలని ఈ పండుగ గుర్తుచేస్తుంది. సమాజంలో శాంతి, సమానత్వం వెల్లివిరియాలని కోరుకుంటూ.. లోకమంతటికీ ఈద్ శుభాకాంక్షలు!

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com
99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ప్రజలంతా ఐకమత్యంగా ఉండాలి: కేఎల్ఆర్

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చ్ 19: నూతన సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా కొత్త క్యాలెండర్ ను ఆవిష్కరించారు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... శ్రీ పరాభవ నామ సంవత్సరం తెలుగు ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కోరుకున్న పనులు, లక్ష్యాలు పూర్తి కావాలని ఆకాంక్షించారు.ప్రకృతి అన్ని మహేశ్వరం నియోజకవర్గ ప్రజలందరికి అనుకూలించాలని కిచ్చెన్న ప్రార్థించారు.వ్యక్తుల మధ్య ఈర్ష్య, ద్వేషాలు లేకుండా, ఐకమత్యంగా, పాజిటివ్ దృక్పథంతో ఉండాలని ఉగాది పండుగ శుభాకాంక్షలు మరోసారి కేఎల్ఆర్ తెలియజేశారు.

నెరవేరిన పేదల సొంతింటి కల

- పేదల కుటుంబాల్లో సంబరం

ప్రతిపక్షం, చిట్యాల, మార్చి 19: ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న పేదల సొంతింటి కలను నిజం చేస్తూ, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం నియోజకవర్గంలో ఆనందపు వెలుగులు నింపుతోంది. నల్గొండ జిల్లా, చిట్యాల మండలం పెద్దకాపర్తి, గుండ్రాంపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ముఖ్య అతిథిగా పాల్గొని, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు గౌరవప్రదమైన జీవనం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ గృహ నిర్మాణ పథకాన్ని చేపట్టిందని తెలిపారు. ఇది కేవలం భవన నిర్మాణం మాత్రమే కాదని, సామాజిక సమానత్వానికి, అభివృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. సొంతింటి కల నెరవేరిన వేళ లబ్ధిదారుల ముఖాల్లో కనిపిస్తున్న చిరునవ్వే ఈ పథకం విజయానికి నిదర్శనమని కొనియాడారు. తమ కల నిజం చేసినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ఆయా గ్రామాల సర్పంచులు కాటం వెంకటేశం, బత్తుల లక్ష్మీ ప్రసన్న నరసింహ పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన సునీల్ రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, మార్చి 20: కరీంనగర్ లోని చైతన్యపురిలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధికా ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఉగాధి పర్వదినం సంధర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కు ఉగాధి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి పదవి సహకరించిన సంజయ్ కుమార్ ను యాదగిరి సునీల్ రావు శాలువాలతో సత్కరించి... ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ను శాలువాలతో సత్కరించి... అభినందించారు. ఈ సంధర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేలా పార్టీ కోసం కృషి చేయాలని సునీల్ రావు కు సూచించారు. బీజేపీ పార్టీ మరింత బలోపేతం అయ్యేలా పార్టీ శ్రేణులతో కలిసి పని చేయాలని అన్నారు.

జగ్గారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా ఉగాది సంబురాలు

- పాల్గొన్న టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జయా చైతన్య రెడ్డి, భరత్ సాయి రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 19: ప్రతీ ఏడూ మాదిరిగా ఈ ఏడాది రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు అంబరాన్ని అంటాయి. టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం లో రామ్ నగర్ రామ్ మందిర్ లో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గారెడ్డి స్వయంగా పాటలు పాడుతూ, భక్తి గీతాలు ఆలపిస్తూ భజన లో పాల్గొన్నారు. పేలాల లడ్డు ప్రసాదం తో భజన కీర్తనలు పాడుతూ రామ్ నగర్ లో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం రామ్ మందిర్ లో శ్రీ కృష్ణ భగవానుడి ఉట్టి కొట్టడం నిర్వహించారు. అనంతరం తరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం రామ్ మందిర్ పై నుండి పేలాల లడ్డూ ప్రసాదాన్ని భక్తుల పైకి విసిరేశారు. ఉగాది రోజు ఈ లడ్డూ ప్రసాదాన్ని అందుకుంటే అదృష్టం వరిస్తుందని భక్తులకు నమ్మకం. ఈ ప్రసాదాన్ని అందుకోవడానికి వేలాది మంది భక్తులు రామ్ మందిర్ కు చేరుకుని ప్రసాదాన్ని అందుకోవడానికి పోటీలు పడ్డారు. ఈ కార్యక్రమం లో టీజిఐఐసి నిర్మలా జగ్గారెడ్డి తో పాటు జగ్గారెడ్డి కూతురు జయా చైతన్య రెడ్డి, కొడుకు భరత్ సాయి రెడ్డి లతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

'శ్రీ పరాభవ' నామ సంవత్సర శుభారంభం

- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 19: పవిత్ర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని నగరంలోని తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో నూతన సంవత్సర ప్రత్యేక పూజలు మరియు పంచాంగ శ్రవణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మరియు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితమ్మ ని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

దూపల్లి జడ కొప్పులో పాల్గొన్న పోలీస్ కమిషనర్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 19 : ఉగాది పండుగ పురస్కరించుకొని రెంజల్ మండలం దుపల్లి గ్రామంలో భక్త ఆంజనేయస్వామి హనుమాన్ మందిరంలో జరిగిన జడ కొప్పు కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తున్న జూపల్లి గ్రామ అభివృద్ధి కమిటీకి అదేవిధంగా భక్తిశ్రద్ధలతో కోలాటల్లో అంగరంగ వైభవంగా జడ కొప్పు ఆడుతున్న సభ్యులకు పోలీస్ కమీషనర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఎ.సి.పి శ్రీనివాస్ , రెంజల్ ఎస్.ఐ చంద్రమోహన్ , దూపల్లి గ్రామ సర్పంచ్ ధనుర్ నరసవ్వ సాయి రెడ్డి , ధూపెల్లి గ్రామ ఎక్స్ సర్పంచ్ భూమారెడ్డి, ఎక్స్ సొసైటీ చైర్మన్, గ్రామ అభివృద్ధి సభ్యులు బాబన్న లింగం మహేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పటాన్ చెరు లో ఘనంగా పంచాంగ శ్రవణం
- హాజరైన ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 19 : తెలుగు ప్రజల తొలి పండుగ ఉగాది శ్రీ పరాభవ నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో నూతన కాంతి వెలుగులు నింపాలని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అభిలాషించారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని గురువారం సాయంత్రం పటాన్ చెరు పట్టణంలోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాశి ఫలాలను వివరించారు. మినీ ఇండియాగా పేరుందిన పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ శ్రీ పరాభవ నామ సంవత్సరం విజయాలు, అష్ట ఐశ్వర్యాలు కలిగించి సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రజలందరికీ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని పటాన్ చెరు లోని చైతన్య నగర్ హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసిన శ్రీరామనవమి కళ్యాణ పత్రిక రూపకల్పన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈనెల 25వ తేదీ నుండి 29వ తేదీ వరకు శ్రీరామనవమి కళ్యాణ ఉత్సవాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. భక్తులందరూ భారీ సంఖ్యలో హాజరై కార్యక్రమాలను దిగ్విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, పట్టణ పుర ప్రముఖులు, మాజీ ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

ఐఎన్టీయూసీ పేరుతో చట్ట విరుద్ధ కార్యకలాపాలు

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి19: ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో కార్మికుల హక్కుల పరిరక్షణపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడ శివ మాట్లాడుతూ,ఐఎన్టియుసికి అనుబంధంగా లేని హైదరాబాద్ రంగారెడ్డి రైస్ మిల్స్ అండ్ రైస్ ట్రేడర్స్ వర్కర్స్ యూనియన్ (A4516)గత కొంతకాలంగా కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.ఈ యూనియన్,హైదరాబాద్ రంగారెడ్డి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌తో ఒప్పందాలు కుదుర్చుకుని, కార్మికులకు రావలసిన న్యాయమైన గిట్టుబాటు ధరలు మరియు ఇతర హక్కులను కాలరాస్తోందని విమర్శించారు.ఇలాంటి చర్యలను అరికట్టేందుకు సంబంధిత యూనియన్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా లేబర్ అధికారిని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు బిజ్జుల రామకృష్ణారెడ్డి ,ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రవణ్ కుమార్,ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు ఐలేష్ తదితర కార్మిక నాయకులు పాల్గొన్నారు.

అవినీతిపరులకు ఈ ఏడాది పరాభవం తప్పదు

- అర్బన్ ఎమ్మెల్యే ధన పాల్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 19 : అవినీతిపరులు, అక్రమాలు, అధర్మానికి పాల్పడే వారికి ఈ ఏడాది పరాభవం తప్పదని అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్త అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కిషన్ గంజ్ లో ఆర్యవైశ్య సంఘం (పట్టణ) ఆధ్వర్యంలో ఉగాదిని పురస్కరించుకొని పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా మాట్లాడుతూనదాదాపు గత 52 సంవత్సరాలుగా వైశ్య సంఘానికి పంచాంగ శ్రవణం వినడానికి రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. సనాతన ధర్మం ఆచార వ్యవహారాలు పాటించడంలో వైశ్యులు ముందుంటారని కొనియాడారు. కేవలం హిందూ సంస్కృతిని పాటించడమే కాకుండా అందరిని ఏకం చేయడంలో వైశ్యుల పాత్ర కీలకమన్నారు. హిందూ సాంప్రదాయం ప్రకారం జనవరి 1 నూతన సంవత్సర కాదని, ఉగాదినే కొత్త సంవత్సరమని తెలిపారు. యువత పోకడలకు పోకుండా ఉగాదిని నూతన సంవత్సరంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పంచాంగ శ్రవణం చేసిన వేద పండితులు బ్రహ్మశ్రీ వేలేటి గౌరీ శంకర్ శర్మను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ 18 వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి రాము, బీజేపీ స్థానిక 34 డివిజన్ కార్పొరేటర్ బంటు ప్రవీణ్ (పందు), ఆర్యవైశ్య సంఘం (పట్టణ) అధ్యక్షులు ధన్పాల్ శ్రీనివాస్ గుప్తా, ప్రధాన కార్యదర్శి ఇల్లెందుల ప్రభాకర్ గుప్తా, కోశాధికారి గాలి నాగరాజు గుప్తా, కన్వీనర్లు లాబిశెట్టి శ్రీనివాస్ గుప్తా, పార్శి మారుతి గుప్తా, సుధాకర్ గుప్తా, రాజా ప్రతాప్ గుప్తా, నేతి మోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే మహిళల పురోభివృద్ధి

- మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, మార్చి 19: కాంగ్రెస్ పాలనలోనే మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధిస్తారని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కప్పంపల్లి సత్యనారాయణ అన్నారు. గురువారం తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామంలో వీవో భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కపంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పాటు ఉన్నదని ఆయన చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని అందుకు అనుగుణంగానే ఎలాంటి వడ్డీ లేని రుణాలు బ్యాంకుల ద్వారా మహిళా సంఘాలకు అందిస్తున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ప్రతి మహిళా సంఘానికి 2 లక్షల రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే దాన్ని అమలు చేసిందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అంతేకాకుండా వడ్డీ లేని రుణాలు ఇస్తూ మహిళలను మహిళా సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని, మహిళా సంఘాల పటిష్టతకు పాటుపడలేదని ఆయన విమర్శించారు. మహిళా స్వయం సేవక సంఘాలకు సంబంధించి గత కాంగ్రెస్ ప్రభుత్వ

హయాంలో మంజూరైన పనులను బీఆర్ఎస్ పాలకులు చేపట్టారే తప్ప కొత్తవి చేపట్టలేదన్నారు. బీఆర్ఎస్ తర్వాత మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘం, వీవో భవన నిర్మాణాలను వేగవంతం చేసిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్ మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, గ్రామ సర్పంచ్ తాట్ల తిరుపతి, ఉప సర్పంచ్ మహేష్, పార్టీ నాయకులు జె. లింగయ్య, జె రవి, రమేష్ పాశం రాజిరెడ్డి సతీష్‌రెడ్డి రవికుమార్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ కాలనీలో...

తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలో నూతనంగా నిర్మించ తలపెట్టిన వివో భవనం పనులకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి శ్వేత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేష్, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, దావు సంపత్ రెడ్డి, కొత్త తిరుపతిరెడ్డి, బుదారపు శ్రీనివాస్, మాచర్ల అంజయ్య, గోగూరి నరసింహారెడ్డి అజయ్, మాచర్ల శీను, అలవాల బాబు, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేదునూరులో...

నేదునూరు గ్రామంలో వీవో భవన నిర్మాణం పనులకు మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కనకం లక్ష్మి కొమరయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారు రమేష్, పార్టీ నాయకులు రెడ్డి గాని రాజు, ఉప్పులేటి రాజు మామిడి అనిల్ కుమార్, గోగూరి నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో ఆర్ఎస్ఎస్ పాత్ర కీలకం

- ఆర్ఎస్ఎస్ ఉగాది ఉత్సవాల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 19 : హిందూ సమాజాన్ని జాగృతం చేయడంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ పాత్ర ఎంతో కీలకమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని బస్వాగార్డెన్ లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ హిందువుల ప్రతి పండుగను, ఆచార వ్యవహారాలను చాటి చెప్పడంలో ఆర్ఎస్ఎస్ ముందుంటుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలతో హిందువులు జాగృతమవడమే కాకుండా ఐక్యత పెరుగుతుందన్నారు. కేవలం సేవనే కాకుండా పండుగల విశిష్టతను తెలియజేయడం ఎంతో గర్వనీయమన్నారు. ప్రధానంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ పుట్టినరోజు కూడా ఉగాది రోజునే కావడం ఎంతో విశిష్టమైందన్నారు. దశాబ్దాల కాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న సాంప్రదాయాలను పాటిస్తూ ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. పిల్లలను ప్రతి రోజు శాఖకు పంపండి సమాజం మార్పు చెందాలంటే మొదట మన ఇంటి నుంచే ప్రారంభం కావాలన్నారు. అనంతరం పంచాంగ శ్రవణం చేసిన మాకునూరి పురుషోత్తమాచార్యులును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ జక్కా రవి, తదితరులు పాల్గొన్నారు.

“

క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతాననే వార్తల్లో నిజం లేదు. కచ్చితంగా వరల్డ్ కప్ లో నిరాశపరిచాను. అయితే నేను ఇంకా వైట్ బాల్ క్రికెట్ ఆడాలనుకుంటున్నా. తిరిగి ఫామ్‌లోకి వస్తాననే నమ్మకం ఉంది. అయితే నేను కెప్టెన్/సెలక్టర్ కాదు. ఏం జరుగుతుందో చూద్దాం'

- ఇంగ్లండ్ స్టార్ క్రికెటర్ జోస్ బట్లర్

కాళేశ్వరం జలాలతో హరీశ్ రావు సెల్ఫీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 19: నంగునూరు మండలంలోని కాళేశ్వరం కాలువలో గోదావరి జలాలు ప్రవహిస్తున్న దృశ్యాలను చూసి మాజీ మంత్రి హరీశ్ రావు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాలువ వద్ద సెల్ఫీ తీసుకుని సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నారు.గోదావరి జలాల గలగలలతో నిండిన కాలువను చూసి తన మనసు పులకించిందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో కూడా సాగునీరు అందుబాటులో ఉండటం రైతులకు ఎంతో ఉపశమనం కలిగిస్తోందని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రంలో నీటి కొరత సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని, ఈ ప్రాజెక్ట్ రూపకల్పనలో కేసీఆర్ చేసిన కృషి చారిత్రాత్మకమని హరీశ్ రావు ప్రశంసించారు. రైతుల కళ్లలో కనిపిస్తున్న ఆనందమే ఈ ప్రాజెక్ట్ విజయానికి నిదర్శనమని తెలిపారు.

ఉత్సవ మేళా కాదు.. రైతు నిరుత్సాహ మేళాలు నిర్వహించండి

- రుణ మాఫీ చేయలేదు
- రైతు భరోసా రాలేదు.. ఎందుకీ మేళాలు
- రైతు ఉత్సవాలపై హరీష్ రావు విమర్శలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 19: రాష్ట్రంలో రైతు సమస్యలు పరిష్కరించకుండా రైతు ఉత్సవాలు నిర్వహించడం సరైనది కాదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శించారు. నర్మెట్ట గ్రామంలో నిర్వహించిన రైతు ఉత్సవాల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ...నర్మెట్ట గ్రామంలోనే సగం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, మూడు సీజన్లుగా రైతు భరోసా డబ్బులు అందలేదని తెలిపారు. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉందని అన్నారు.సిద్దిపేట నియోజకవర్గంలో వేలాది మంది రైతులకు వందల కోట్ల రూపాయల రుణమాఫీ బకాయిలు ఉన్నాయని, రాష్ట్రంలో లక్షలాది మంది రైతులు ఇంకా రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ చేస్తామని చెప్పినా, ఆ హామీ అమలు కాలేదని విమర్శించారు. మూడు సీజన్లుగా అకాల వర్షాలు, వడగళ్ల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, ఇన్‌పుట్ సబ్సిడీ కూడా అందించలేదని ఆరోపించారు. పంట బీమా పథకం అమలు విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు.రైతు భరోసా కింద సిద్దిపేట నియోజకవర్గానికే భారీగా బకాయిలు ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వేల కోట్ల రూపాయలు రైతులకు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వెంటనే ఈ మొత్తాలను రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉగాది పండగ సందర్భంగా అయినా రైతుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని హరీష్‌రావు కోరారు.

మంత్రి తుమ్మలను కలిసిన అత్తు ఇమామ్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 19: సిద్దిపేట జిల్లాలోని నంగునూరు మండలం నర్మెట్టలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ సందర్శనకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ను చూసి ఎలా ఉన్నావ్ అంటూ ఆప్యాయంగా పలకరించారు. ఈనెల 22న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాబోతున్నందున మంత్రులు పొన్నం ప్రభాకర్ గడ్డం వివేక్ తుమ్మల నాగేశ్వర్ రావు ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. సందర్శనకు వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీకి రైతు సోదరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గయాజుద్దీన్ తప్పట శంకర్ విజయ డానియల్ ఆత్మ రాములు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణ లోపం.. కెనాల్ కాల్వకు గండి

- ఇరిగేషన్ అధికారులపై రైతుల మండిపాటు

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 19: ఇరిగేషన్ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం వలన కెనాల్ కాల్వకు గండి పడటం వల్ల నీళ్ళు వృధా పోతుండటంతో రైతులు మండిపడుతున్న ఘటన దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామ సమీపంలో మల్లన్న సాగర్ నుంచి వచ్చే కెనాల్ కాల్వకు గండి పడింది.దీంతో నీళ్లు రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ వైపు వెళ్లే కాలువ కావడంతో కాల్వకు గండిపడడంతో నీళ్ళు ఆ ప్రాంత చెరువులోకి వెళ్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. స ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు కాలువల పర్యవేక్షణ చేయకపోవడం వల్లే ఇలా కాల్వకు గండి పడిందంటూ రైతులు మండిపడుతు న్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కాలువను మరమత్తు చేయించాలని లేనిపక్షంలో కెనాల్ కాల్వ కింద సాగు చేసిన పంటలు ఎండిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

వైభవంగా ఎడ్ల బండ్ల ఉత్సవం

- అవుసులపల్లిలో ఘనంగా ఉగాది సంబరాలు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 19: మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని అవుసులపల్లిలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామ దేవతలకు ఎడ్ల బండ్ల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామమంతా పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఎడ్ల బండ్లను పూలు, రంగురంగుల కాగితాలతో అలంకరించి గ్రామ వీధుల్లో ఊరేగింపుగా తీసుకెళ్లగా, సంప్రదాయ వాయిద్యాల నడుమ జరిగిన ఈ ప్రదర్శన ప్రజలను ఆకట్టుకుంది.యువకులు, చిన్నారులు నృత్యాలతో సందడి చేయగా,మహిళలు మంగళ హారతులు పట్టి అమ్మవారిని ప్రార్థించారు. గ్రామ ప్రజలు మంచి వర్షాలు, పంటలు బాగా పండాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవం గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కొట్టాల లలితా విశ్వం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో గ్రామస్థులు హాజరై ఉగాది సంబరాలను ఆనందంగా జరుపుకున్నారు.

ఎడ్ల బండ్ల ఉత్సవాన్ని ప్రారంభించిన వంటేరు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 19: నియోజకవర్గ కేంద్రంలోని గజ్వేల్ పట్టణంలో "ఉగాది" పండుగ పురస్కరించుకొని ఆనవాయితీగా వస్తున్న ఎడ్ల బండి తిరిగే కార్యక్రమాన్ని గురువారం నాడు గజ్వేల్ నియోజకవర్గం బిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలోమున్సిపల్ చైర్ పర్సన్ చందన రవి, వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్ కార్ పద్మ భాయి నర్సింగ్ రావు, కౌన్సిలర్ బొగ్గుల సురేశ్, శ్రీధర్ మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ చైర్మన్ గా మహేందర్ రెడ్డి

ప్రతిపక్షం, దుబ్బాక, మార్చి 19: దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలోని శ్రీ రాజా వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ నూతన చైర్మన్ గా సత్తు మహేందర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మెన్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల,దేవాలయ కమిటీ సభ్యుల సహాయ, సహకారంతో పురాతన మైన వేణుగోపాల స్వామి ఆలయ అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తానన్నారు.

శాంతి, సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ

- బూరుగుపల్లిలో ఘనంగా ఇఫ్తార్ విందు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, మార్చి 19: రంజాన్ పండుగ సమాజంలో శాంతి, సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ సాయిలు పేర్కొన్నారు. హవెలిఘనపూర్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో నిర్వహించిన ఇఫ్తార్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఉపవాస విరమణ విందులో పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ సాయిలు మాట్లాడుతూ.. ఇఫ్తార్ అనేది కేవలం ఉపవాస విరమణ మాత్రమే కాదని, స్నేహం, ఐక్యత,సోదర భావానికి ప్రతీక అని అన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించాలని ఆయన ఆకాంక్షించారు. మైనారిటీ సోదరులకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని ఉపవాస దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజు, వార్డు సభ్యులు రమేష్, సాయిలు, కృష్ణ, సన్నీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్యాల. శ్రీనివాస్, నర్సింహులు, సాయిబాబా, దుర్గయ్య, లెంక రాజు, లెంక బాబు, సుధాకర్, బిఆర్ఎస్ నాయకులు బాలరాజ్ , వెంకట్, మత పెద్దలు ,ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు.

కవిత కొత్త పార్టీపై కోర్టు సూచనలకు హర్షం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 19: తెలంగాణలో కొత్త రాజకీయ పార్టీ నమోదు దిశగా కల్వకుంట్ల కవిత తీసుకున్న చర్యలకు ఊతమిస్తూ, ఢిల్లీ హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి వారం రోజుల్లో నిర్ణయం తీసుకోవాలని సూచించిన నేపథ్యంలో సిద్దిపేట జిల్లా జాగృతి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాగృతి నాయకులు సిద్దరాబోయిన శ్రీనివాస్, గౌస్మియా, వరికోలు శ్రీనివాస్, బాసన్ గారి జోగ్ రెడ్డి లు మాట్లాడుతూ, కవిత కొత్త పార్టీ త్వరలోనే రూపుదిద్దుకుని తెలంగాణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఉగాది పర్వదినాన ఈ తీర్పు రావడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు.

మెదక్‌లో ఘనంగా ఉగాది పంచాంగ శ్రవణం

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 19: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మెదక్ పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహం వెల్లివిరిసింది. పట్టణంలోని శ్రీ కోదండ రామాలయం,వెంకటేశ్వర దేవాలయం మరియు అయ్యప్ప దేవాలయంల్లో పూజ్య బ్రాహ్మణులు వైద్య శ్రీనివాస్ శర్మ, రాజు శర్మలు శాస్త్రోక్తంగా పంచాంగ శ్రవణం నిర్వహించారు.వేద మంత్రోచ్చారణల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమంలో నూతన సంవత్సరానికి సంబంధించిన రాశిఫలాలు, గ్రహగతులు, శుభ ముహూర్తాలను భక్తులకు వివరించారు. పంచాంగ శ్రవణం వినేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, హారతులు ఘనంగా నిర్వహించగా, భక్తులు స్వామివారి దర్శనం పొందారు. పంచాంగ శ్రవణం ద్వారా ప్రజలందరికీ శాంతి, సౌభాగ్యం, ఐశ్వర్యం కలగాలని బ్రాహ్మణులు ఆశీర్వదించారు.మొత్తంగా ఉగాది పర్వదినాన మెదక్ పట్టణంలో భక్తి వాతావరణం,ఆధ్యాత్మిక సందడి కనిపించింది.

చేర్యాల పట్టణంలో ఉగాది పంచాంగ శ్రవణం

ప్రతిపక్షం చేర్యాల, మార్చి 19: తెలుగు సంవత్సరాది పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో పంచాంగ పఠనం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు రాజు స్వామి ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ పురోహితులు వేద స్వరూపులు శ్రీ దేశపతి రామన్న, మర్మముల రామన్నలు పంచాంగ పఠనం చేశారు.ఈ సందర్భంగా ద్వాదశ రాశులకు సంబంధించిన గ్రహచారాలు, రాజపూజ్య అవమానాలు, కందాయ ఫలితాలు, పంటల పరిస్థితులు, రాజకీయ పరిణామాలు, ప్రభుత్వ విధానాలు, దేశకాల పరిస్థితులను సవివరంగా గ్రామ ప్రజలకు వివరించారు.కార్యక్రమం ప్రారంభానికి ముందు గణపతి పూజ నిర్వహించి, వేద బ్రాహ్మణులను సన్మానించారు. అనంతరం నూతనంగా ఏర్పడిన మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో చైర్మన్ అరుణా బాలె నర్సయ్య, వైస్ చైర్మన్

ఉమా శ్రీధర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ ఉగాది పర్వదిన వేడుకల్లో గ్రామ ప్రజలు, రాజకీయ ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, విహెచ్‌పి సభ్యులు, దాతలు, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. ఈ ఏడాది రైతు నామ సంవత్సరంగా ఉండబోతోంది. అన్నదాతలకు ₹2లక్షల వరకు రుణమాఫీ చేశాం. భూభారతితో భూమి సమస్యలను పరిష్కరిస్తున్నాం. రైతు భరోసాకు ₹18వేల కోట్లు ఖర్చు పెట్టాం. ఈ నెల 22న మరో విడత డబ్బులు రిలీజ్ చేయనున్నాం. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజును చేయడమే మా లక్ష్యం.

- సీఎం రేవంత్ రెడ్డి

వెంటనే సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలి

- పశ్చిమాసియా యుద్ధంపై వివిధ ప్రభుత్వాధినేతలతో మోదీ సంభాషణ
- గల్ఫ్ దేశాలపై దాడులు సరికావు.. భారత ప్రధాని మోదీ స్పష్టీకరణ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 19: పశ్చిమాసియా యుద్ధంపై ఫ్రాన్స్ అధ్యక్షుడు, ఒమన్ సుల్తాన్, మలేసియా ప్రధానులతో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం టెలిఫోన్‌లో సంభాషించారు. వెంటనే ఈ సైనిక ఉద్రిక్తతలను తగ్గించి, చర్చలు, దౌత్యాన్ని తిరిగి ప్రారంభించాల్సిన అవసరం ఉందని ఈసందర్భంగా అందరు నేతలు అభిప్రాయపడ్డారు. ఈ సంభాషణల వివరాలతో ప్రధాని మోదీ వేర్వేరు ట్వీట్లు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మక్రాన్‌తో మాట్లాడానని ఆయన తెలిపారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, సుస్థిరతల సాధన కోసం ఇకపైనా పరస్పర సమన్వయంతో పనిచేయాలని తామిద్దరం నిర్ణయించినట్లు మోదీ వెల్లడించారు. గురువారం ఉదయం ఒమన్ సుల్తాన్ హైతమ్ బిన్ తారిఖ్ అల్ సయీద్‌తో ప్రధాని మోదీ సంభాషించారు. ఒమన్ సుల్తాన్‌కు, ఆ దేశ ప్రజలకు రంజాన్ పండుగ ముందస్తు శుభాకాంక్షలను మోదీ తెలిపారు. తమ సంభాషణ ఫలవంతంగా జరిగిందంటూ భారత ప్రధాని ట్వీట్ చేశారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పశ్చిమాసియాలో సైనిక ఉద్రిక్తతలను తగ్గించాలనే అభిప్రాయానికి తాము వచ్చామన్నారు. సైనిక ఉద్రిక్తతలు తగ్గితేనే శాంతి, సుస్థిరతల పునరుద్ధరణ సాధ్యమవుతుందని మోదీ తెలిపారు. ఒమన్‌పై జరిగిన దాడులను భారత ప్రధాని ఖండించారు. వేలాదిమంది భారతీయులు సురక్షితంగా భారత్‌కు తిరిగి చేరడానికి సౌకర్యాలు కల్పించినందుకు ఒమన్ సర్కారును ప్రశంసించారు. కీలకమైన హర్మూజ్ జలసంధి మీదుగా ఉన్న సముద్ర రవాణా మార్గాల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని భారత్, ఒమన్ నిర్ణయించాయన్నారు. హర్మూజ్ మీదుగా సురక్షిత, స్వేచ్ఛాయుత రవాణా జరిగే పరిస్థితులు ఏర్పడాలని ఇరుదేశాలు కోరుకుంటున్నాయని మోదీ పేర్కొన్నారు.



విశ్వ వీక్షణం

అసోం తొలిజాబితా విడుదల చేసిన బీజేపీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 19: అసోం శాసనసభ ఎన్నికల కు సంబంధించి బీజేపీ అభ్యర్థుల తొలి జాబితాను విడుదల చేసింది. మొత్తం 88 మంది అభ్యర్థుల పేర్లను జాబితాలో పేర్కొంది. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ జాలుక్‌బారీ నియోజకవర్గం నుంచి పోటీ చేయనున్నారు. ఇది ఆయనకు కంచుకోటగా మారింది. 2001 వరుసగా ఐదుసార్లు ఎన్నికల్లో హిమాంత ఇక్కడి నుంచే విజయం సాధించారు. ఇక, కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన కీలక నేతల పేర్లు కూడా తాజా జాబితాలో ఉన్నాయి. ఇటీవల బీజేపీలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర విభాగం మాజీ అధ్యక్షుడు భూపేన్ కుమార్ బోరా బిహ్‌పురా నియోజకవర్గం నుంచి బరిలోకి దిగారు. ఇక బుధవారం కాంగ్రెస్‌ను వీడి కాషాయం కండువా కప్పుకున్న ప్రద్యుత్ బోర్దోలోయ్ డిస్పూర్ నుంచి పోటీ చేయనున్నారు. కాగా 126 అసెంబ్లీ స్థానాలు ఉన్న అస్సాంలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

పిచ్చుకలు కనుమరుగు

ఆందోళనలో ప్రకృతి ప్రేమికులు
నేడు ప్రపంచ పిచుకల దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్

ఒకప్పుడు ప్రతి ఇంటి ముంగిట, చెట్ల కొమ్మలపై గుంపులుగా కనిపించే పిచ్చుకలు నేడు కనుమరుగైపో తుండటం ఆందోళన కలిగిస్తోంది. వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, వాతావరణ కాలుష్యం, సెల్‌ఫోన్ టవర్ల నుంచి వెలువడుతున్న రేడియేషన్ కారణంగా ఈ చిన్న పక్షుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోంది.వ్యవసాయానికి మిత్రులైన పిచ్చుకలు పొలాల్లో పురుగులను తిని రైతులకు మేలు చేస్తాయి. అయితే రసాయన పురుగుమందుల అధిక వినియోగం, చెట్ల కొరత, నివాస స్థలాల లోపం వంటి కారణాలు వాటి జీవనానికి ముప్పుగా మారాయి. పిచ్చుకల సంరక్షణకు ముందుకొచ్చిన అనంతుల రమేష్ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కిసాన్ నగర్‌కు చెందిన అనంతుల రమేష్ పిచ్చుకల సంరక్షణకు నడుం బిగించారు. తన ఇంటి ఆవరణాన్ని పిచ్చుకలకు అనుకూల మైన ఆవాసంగా మార్చి ఆదర్శంగా నిలిచారు.ఇంటి పరిస రాల్లో కృత్రిమ గూళ్లు ఏర్పాటు చేయడంతో పాటు, తినడా నికి గింజలు, మట్టి పాత్రల్లో నీటి సదుపాయం కల్పించారు. అలాగే పచ్చని చెట్లను పెంచడంతో వందలాది పిచ్చుకలు అక్కడికి చేరి గూళ్లు కట్టి, సంతానోత్పత్తి చేస్తున్నాయి.

కిలకిలరావాలతో మేల్కొనే ఇల్లు

ప్రతి ఉదయం పిచ్చుకల కిలకిలరావాలతో రమేష్ కుటుంబం మేల్కొంటుంది. ఆ దృశ్యాన్ని చూడటానికి చుట్టుపక్కల వారు, చిన్నపిల్లలు ఆయన ఇంటికి చేరుకుంటున్నారు. పక్షుల సందడితో ఆ ప్రాంతం ప్రకృతి సోయగంతో కళకళలాడుతోంది.

> **"పిచ్చుకలు మా ఇంటి సభ్యుల్లా మారాయి. వాటికి గూళ్లు, ఆహారం, నీటి సదుపాయం కల్పించడం మా బాధ్యతగా భావిస్తున్నాం. మా పిల్లలు కూడా వాటిని ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు," అని రమేష్ తెలిపారు.**

పిచ్చుకల సంరక్షణపై నిపుణుల సూచనలు

పిచ్చుకలను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇంటి వద్ద గింజలు, నీరు ఉంచడం, చెట్లు నాటడం, రసాయనాల వాడకాన్ని తగ్గించడం వంటి చిన్న చర్యలతో పిచ్చుకలను రక్షించవచ్చని పేర్కొంటున్నారు. ప్రకృతి సమతుల్యత కోసం పిచ్చుకలను కాపాడటం మనందరి బాధ్యత అని నిపుణులు సూచిస్తున్నారు.

దేశంలో దాడులకు ప్లాన్

- ఉగ్రకుట్రను ఛేదించిన పోలీసులు
- పాక్ కు సహకరిస్తున్న ఇద్దరి అరెస్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, మార్చి 19: దేశంలో ఉగ్రవాద దాడులు జరిపేందుకు కుట్ర పన్నుతున్న ఓ ముఠా పట్టుబడింది. పుణ్యక్షేత్రాలు, కీలక ప్రదేశాల ఫొటోలు, వీడియోలు, లొకేషన్ వివరాలు సరిహద్దు అవతల ఉన్న పాకిస్థాన్ హ్యాండ్లర్లకు సోషల్ మీడియా ద్వారా పంపుతున్నారనే ఆరోపణలపై పాక్ ఆధారిత గ్యాంగ్‌స్టర్ నెట్ వర్క్‌కు చెందిన ఇద్దరు అనుమానితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో అధికారులు ఉగ్రకోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ హాపుడ్‌లోని మొఘల్ గార్డెన్‌లో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేసినట్లు పోలీసులు గురువారం మీడియాకు వెల్లడించారు. అరెస్టు అయిన యువకులు ఒక ఆలయం, దిల్లీ కాలనీకి సంబంధించిన ఫొటోలు, వీడియోలు, లొకేషన్స్‌ను సోషల్ మీడియా ద్వారా ఒక పాకిస్థానీ గ్యాంగ్‌కు పంపుతున్నారని ఐబీ నుంచి తమకు సమాచారం అందిందని పేర్కొన్నారు. ఈ మేరకు తాము ఇద్దర్ని అరెస్ట్ చేశామని వెల్లడించారు. "ధౌలానాలోని మొఘల్ గార్డెన్‌లో ఉన్న ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇద్దరు యువకులను అరెస్టు చేశాం. అరెస్టు అయిన ఇద్దరు అనుమానితులలో ఒకరు మొఘల్ గార్డెన్‌కు చెందిన సలీం రాణా కుమారుడు అజీమ్ రాణా, మరొకరు మేరఠ్ జిల్లాలోని జై గ్రామానికి చెందిన నౌషాద్ కుమారుడు ఆజాద్ రాజ్‌పుత్. రాణా దిల్లీలోని ఒక మాల్‌లో డ్రైఫ్రూట్ స్టాల్ నడుపుతున్నాడు. రాణాకు బంధువైన రాజ్‌పుత్ గురుగ్రామ్‌లోని ఒక పైపుల ఫ్యాక్టరీలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. వారిద్దరి దగ్గర నుంచి రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నాం" అని హాపుడ్ ఎస్పీ కున్వర్ జ్ఞానంజయ్ సింగ్ తెలిపారు.

బెంగాల్‌లో అప్రకటిత ఎమర్జెన్సీ

- ఈసీ, బీజేపీపై తీవ్రంగా మండిపడ్డ మమతా బెనర్జీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కతా, మార్చి 19: బెంగాల్ లో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయ వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారుతోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘం, బీజేపీపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రకటనకు ముందే 50 మందికి పైగా ఉన్నతాధికారులను బదిలీ చేయడం అన్‌డిక్లేర్డ్ ఎమర్జెన్సీలా ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఎక్స్ వేదికగా స్పందించిన మమతా బెనర్జీ, ఆ చర్యలు పరిపాలనా అవసరాల వల్ల కాకుండా రాజకీయ ఒత్తిడి కారణంగానే జరుగుతున్నాయని ఆరోపించారు. ఈసీ బెంగాల్‌ను ప్రత్యేకంగా లక్ష్యంగా చేసుకోవడం ఇదివరకెన్నడూ చూడని విషయమని, ఇది చాలా ఆందోళనకర పరిణామని ఆమె అన్నారు. చీఫ్ సెక్రటరీ, హోమ్ సెక్రటరీ, డీజీపీ, అదనపు డీజీలు, ఐజీలు, డీఐజీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వంటి కీలక పోస్టుల్లో ఉన్న అధికారులను ఒక్కసారిగా బదిలీ చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగిస్తుందని మమతా అభిప్రాయపడ్డారు. ఈ చర్యలు రాజ్యాంగ సూత్రాలను దెబ్బతీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. మరోవైపు, ఐబీ, ఎస్టీఎఫ్, సీఐడీ వంటి కీలక భద్రతా సంస్థల అధికారులను కూడా ఎంపిక చేసి బదిలీ చేస్తున్నారని మమతా అన్నారు. దీని వల్ల రాష్ట్ర పరిపాలనా వ్యవస్థ బలహీనపడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. "బీజేపీ ఎందుకు ఇంత ఆత్రుతగా వ్యవహరిస్తోంది? బంగాల్ ప్రజలను ఎందుకు ఇలా లక్ష్యంగా చేసుకుంటోంది? స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ప్రజలు తమ పౌరసత్వాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఎందుకు?" అంటూ మమత ప్రశ్నించారు.

భారత్‌లో వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్స్

భారత్ మరో ప్రతిష్టాత్మక క్రీడాటోర్నీకి ఆతిథ్యమివ్వబోతున్నది. ఇప్పటికే 2030 కామన్వెల్త్ గేమ్స్ ఆతిథ్య హక్కులు దక్కించుకున్న భారత్ తాజాగా 2028 వరల్డ్ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీకి వేదిక కాబోతున్నది. గురువారం టూరన్ (పోలండ్) వేదికగా జరిగిన వరల్డ్ అథ్లెటిక్స్ కౌన్సిల్ మీటింగ్‌లో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ విషయాన్ని వరల్డ్ అథ్లెటిక్స్ ఉపాధ్యక్షుడు అదిల్లె సుమరివాల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అయితే మెగాటోర్నీకి ఆతిథ్యమివ్వనున్న భువనేశ్వర్‌లో కళింగ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ స్టేడియం కాంప్లెక్స్‌ను ఇద్దరు సభ్యులతో కూడిన వరల్డ్ అథ్లెటిక్స్ బృందం పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. రెండేండ్ల తర్వాత జరిగే టోర్నీలో మొత్తం 26 ఈవెంట్లలో అథ్లెట్లు పోటీపడనున్నారు. పురుషులకు 13, మహిళలకు 13 విభాగాల చొప్పున కేటాయించారు. ఇందులో 60మీ, 400మీ, 800మీ, 1500మీ, 3000మీ, 60మీ హార్డిల్స్, 4X 400 రిలే, హైజంప్, పోల్‌వాల్ట్, లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్, షాట్‌పుట్, హెప్టాథ్లాన్‌కు చోటు కల్పించారు. దేశంలో అథ్లెటిక్స్‌కు పెరుగుతున్న ఆదరణకు ఇది ఉదాహరణ అని జాతీయ అథ్లెటిక్స్ అసోసియేషన్ (ఏఎఫ్ఐ) అధ్యక్షుడు బహదూర్‌సింగ్ తెలిపారు. ఇదిలా ఉంటే 2028 ఏషియన్ ఇండోర్ అథ్లెటిక్స్ టోర్నీకి కూడా భారత్ వేదికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇంగ్లండ్ సిరీస్ కు ముందు
భారత్ ఐర్లండ్ టూర్

ఇంగ్లండ్‌తో సిరీస్‌కు ముందు భారత క్రికెట్ జట్టు ఐర్లాండ్‌లో పర్యటించనుంది. టీ20 ప్రపంచకప్ డిఫెండింగ్ చాంపియన్ హోదాలో భారత్ జూన్‌లో ఐర్లాండ్‌తో తలపడనుంది. వాస్తవానికి జూన్‌లో ఆఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టుతో పాటు మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడనుంది. ఆ తర్వాత జూలై 1 నుంచి 19 తేదీ మధ్య ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు, మూడు వన్డేల్లో తలపడనుంది. అయితే ఆఫ్ఘానిస్థాన్, ఇంగ్లండ్ సిరీస్ మధ్యలో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనుంది. ఈ విషయాన్ని ఐర్లాండ్స్ హై ఫెర్ఫార్మెన్స్ డైరెక్టర్ గ్రహమ్ వెస్ట్ పేర్కొన్నాడు. ఇటీవల టీ20 ప్రపంచకప్ వైఫల్యంతో ఐర్లాండ్ టీ20 కెప్టెన్సీ నుంచి పాల్ స్టిర్లింగ్ తప్పుకున్నాడు. 2028 టీ20 ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధించాలన్న పట్టుదలతో ఉన్న ఐర్లాండ్ ఆ దిశగా నాయకత్వ మార్పులకు సిద్ధమైంది.

'చెన్నై'కు ఎదురుదెబ్బ...
నాథన్ ఎలీస్ ఔట్

ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ లీగ్‌కు ముందే ఎదురుదెబ్బ తగిలింది. కండరాల గాయంతో ఆస్ట్రేలియా పేసర్ నాథన్ ఎలీస్ లీగ్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని లీగ్ వర్గాలు ఒక ప్రకటనలో అధికారికంగా ధృవీకరించాయి. శ్రీలంక స్టార్ పేసర్ మతీశ పతిరన..కోల్‌కతా నైట్ రైడర్స్ మారిన నేపథ్యంలో పేస్ దళాన్ని ముందుకు నడిపిస్తాడనుకున్న ఎలీస్ కూడా గాయంతో నిష్క్రమించాడు. అయితే ఎలీస్ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని సీఎస్‌కే పేర్కొంది. ఇప్పటి వరకు 17 ఐపీఎల్ మ్యాచ్‌ల్లో 19 వికెట్లు తీసిన ఎలీస్‌ను గత వేలంలో సీఎస్‌కే రూ.2 కోట్లకు తీసుకుంది.

ఒర్లీన్స్ మాస్టర్స్ టోర్నీలో
తన్వి దూకుడు

ఒర్లీన్స్ మాస్టర్స్ టోర్నీలో భారత యువ షట్లర్ తన్విశర్మ ముందంజ వేసింది. పోటీల రెండో రోజైన గురువారం జరిగిన మహిళల సింగిల్స్‌లో తన్వి 2114, 2117తో భారత్‌కే చెందిన అన్మోల్ కర్బ్‌పై అద్భుత విజయం సాధించింది. ఆది నుంచే తనదైన దూకుడు కనబరిచిన ఈ వరల్డ్ జూనియర్ చాంపియన్‌షిప్ రజత విజేత వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేసింది. మెరుపు స్మాష్‌లకు తోడు నెట్‌గేమ్, డ్రాప్ షాట్లతో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేసింది. మరోవైపు పురుషుల డబుల్స్‌లో హరిహరణ్ అమ్సకరుణన్, ఎమ్ఆర్ అర్జున్ ద్వయం 2624, 214తో అలెగ్జాండర్ డున్, ఆడమ్ ప్రింగ్లె జోడీపై గెలిచి క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది.

న్యూయార్క్ ఐకానిక్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై నుండి ట్రైలర్ లాంచ్

ప్రపంచవ్యాప్తంగా అశేష ప్రేక్షకాదరణ పొందిన స్పైడర్ మ్యాన్ సిరీస్‌లో సరికొత్త చిత్రం 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ట్రైలర్ విడుదలైంది. మొట్టమొదటి గ్లోబల్ ఫ్యాన్‌డ్రివెన్ ట్రైలర్ టీజ్ తర్వాత, న్యూయార్క్ నగరంలో ఐకానిక్ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ పై నుండి టామ్ హాలండ్ పూర్తి ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు ఇదొక మరపురాని క్షణంగా నిలిచిపోయింది. 'స్పైడర్‌మ్యాన్: నో వే హోమ్' సాధించిన రికార్డ్‌బ్రేకింగ్ గ్లోబల్ సక్సెస్ తర్వాత, పీటర్ పార్కర్, స్పైడర్ మ్యాన్‌ల జీవితాల్లో 'స్పైడర్‌మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించనుంది. 'నో వే హోమ్' సంఘటనలు జరిగి నాలుగు సంవత్సరాలు గడిచాయి. పీటర్ ఇప్పుడు తనను ప్రేమించేవారి జీవితాలు, జ్ఞాపకాల నుండి తన అస్తిత్వాన్ని పూర్తిగా చెరిపేసుకుని ఒంటరిగా జీవిస్తున్నాడు. తన పేరును ఏమాత్రం గుర్తుపట్టలేని న్యూయార్క్ నగరంలో నేరాలతో పోరాడుతూ, సిటీని రక్షించడానికి ఒక ఫుల్‌టైమ్ స్పైడర్ మ్యాన్‌గా పూర్తిగా అంకితమయ్యాడు. అయితే అతనిపై బాధ్యతలు, ఒత్తిడి పెరిగేకొద్దీ.. ఊహించని శారీరక మార్పులు అతని మనుగడకే ముప్పుగా పరిణమిస్తాయి. అదే సమయంలో నగరంలో జరుగుతున్న వింతైన నేరాల పరంపర అతనెన్నడూ ఎదుర్కోనంతటి అత్యంత శక్తివంతమైన విలన్ ముప్పుకు దారితీస్తుంది. డెస్టిన్ డానియల్ క్రెటన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో స్పైడర్‌మ్యాన్‌గా టామ్ హాలండ్ తిరిగి నటిస్తుండగా, జెండయా, జాకబ్ బటలాన్, సాడీ సింక్, జోన్ బెర్నాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో మరియు ట్రామెల్ టిల్మాన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇండియా నిర్మిస్తున్న ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్, జూలై 31న ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లో అన్ని ప్రీమియం ఫార్మాట్లలో థియేటర్లలో విడుదల కానుంది.



'కరుప్పు'
మే 14న రిలీజ్‌కు రెడీ

సూర్య తన మాగ్నమోపస్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'కరుప్పు' కోసం దర్శకుడు ఆర్జే బాలాజీతో చేతులు కలిపారు. ఈ మోస్ట్ ఎవైటెడ్ మూవీని అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించడం ద్వారా పేరును తెచ్చుకున్న నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తోంది. తమిళం, తెలుగు, హిందీ పరిశ్రమలలో పాపులర్ కంటెంట్‌ను అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని స్కేల్, కంటెంట్ రెండింటినీ దృష్టిలో ఉంచుకుని ప్రతిష్టాత్మకగా తెరకెక్కిస్తోంది. సూర్య పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించిన 'కరుప్పు' ఫస్ట్ లుక్ టీజర్ సంచలనం క్రియేట్ చేసింది. తాజాగా మేకర్స్ రిలీజ్ డేట్ అనౌన్స్ చేశారు. 2026 మే 14న ఈ చిత్రాన్ని వరల్డ్ వైడ్ గ్రాండ్ గా రిలీజ్ కానుంది. రిలీజ్ డేట్ పోస్టర్ సూర్య ఇంటెన్స్ లుక్ అదిరిపోయింది.



శికంజా మాలిక్
మోహన్ బాబు బర్త్‌డే స్పెషల్
'ది ప్యారడైజ్' మూవీ లుక్ రిలీజ్

టాలీవుడ్ లెజెండరీ నటుడు, 'కలెక్షన్ కింగ్' డా. మంచు మోహన్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చింది. నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న ఈ భారీ పాన్‌ఇండియా చిత్రంలో మోహన్ బాబు విలన్ పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మోహన్ బాబు 'శికంజా మాలిక్' అనే పవర్‌ఫుల్ మరియు డార్క్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. అయితే ఆయన పుట్టినరోజు సందర్భంగా చిత్రయూనిట్ శుభాకాంక్షలు తెలుపుతూ.. స్పెషల్ వీడియోను పంచుకుంది. 'ఈతరం వారికి అసలు మోహన్ బాబు అంటే తెలియదు. ప్యారడైజ్ సినిమాతో మోహన్ బాబు అంటే ఎంటో చూపిస్తాం' అంటూ దర్శకుడు శ్రీకాంత్ ఈ వీడియోలో చెప్పుకొచ్చాడు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను SLV సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21, 2026న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంతో పాటు స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో కూడా విడుదల కానుంది.



'ఈగో రాజా'
ఉగాది స్పెషల్ లుక్

శంబాల సక్సెస్‌తో ఫుల్ జోష్ మీదున్నాడు టాలీవుడ్ యంగ్ యాక్టర్ ఆది సాయికుమార్. బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టిన ఆదిసాయికుమార్ గురు శరవణన్ డైరెక్షన్‌లో ఓ సినిమా చేస్తున్నాడని తెలిసిందే. 'ఈగో రాజా' టైటిల్‌తో వస్తోన్న ఈ మూవీని ఎస్‌జీఎస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై జీ సురేశ్ నిర్మిస్తున్నారు. ఆది సాయికుమార్ తమిళ్ డెబ్యూ సినిమాగా వస్తోన్న ఈగో రాజా తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. సతీశ్ కీ రోల్ లో నటిస్తున్నాడు. ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ కొత్త లుక్ విడుదల చేశారు. ఆదిసాయికుమార్ చుట్టూ రౌడీలు, ఒంటిపై గాయాలు, రక్తపు మరకలు చూస్తుంటే హై ఓల్టేజీ యాక్షన్ సీక్వెన్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు తెలుస్తోంది. ఆది నిప్పు రాజేసేలా యాక్షన్ అవతార్‌లో ఇప్పటివరకు లేని విధంగా సిగరెట్ కాలుస్తూ అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తున్నాడు. ఆదిలో ఇదివరకెన్నడూ చూడని డైమెన్షన్‌ను చూడబోతున్నారని తాజా లుక్‌తో హింట్ ఇచ్చేస్తున్నారు మేకర్స్.



'గుమ్మడి నర్సయ్య' కొత్త లుక్ రిలీజ్

పేద ప్రజల గురించి ఆలోచించే రాజకీయ వేత్తగా, ప్రజా నాయకుడిగా ఎంతో ప్రజాదరణ పొందిన నాయకుడు గుమ్మడి నర్సయ్య. ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచే ఆయన బయోపిక్ సిల్వర్ స్క్రీన్‌పై సందడి చేసేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి గుమ్మడి నర్సయ్య టైటిల్‌ను ఫిక్స్ చేశారు మేకర్స్. కన్నడ స్టార్ యాక్టర్ శివరాజ్‌కుమార్ టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. పరమేశ్ హివ్‌రాలే డైరెక్ట్ చేస్తున్నాడు. తాజాగా మేకర్స్ ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. తాజా పోస్టర్‌లో శివన్న ఎర్ర జెండాల మధ్య పిడికిలి బిగించి కనిపిస్తున్నాడు. దృఢ సంకల్పం, మండుతున్న కళ్లు, దశాబ్దాల ప్రజల పోరాటాలను ప్రతిధ్వనించే ఎర్ర జెండాల సముద్రం అంటూ షేర్ చేసిన నయా లుక్ సినిమాపై అంచనాలు మరింత పెంచేస్తుంది. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్‌లో శివన్నతెలుగు రంగు చొక్కా, ధోతిలో భుజాన ఎర్ర కండువా వేసుకుని సైకిల్‌ను తోసుకుంటూ వెళ్తుండటం చూడొచ్చు. సైకిల్ హ్యాండిల్‌కు సీపీఐఎంఎల్ జెండాను గమనించవచ్చు. అసెంబ్లీ ముందు నుంచి మిగిలిప ప్రజాప్రతినిధులంతా బుగ్గ కార్లలో వస్తుంటే.. గుమ్మడి నర్సయ్య మాత్రం సాదాసీదాగా సామాన్య వ్యక్తిలా సైకిల్‌తో వెళ్తుంటాడు. గుమ్మడి నర్సయ్య పేరునే టైటిల్‌గా ఫిక్స్ చేసి మొదటి ప్రయత్నంలోనే అందరి ఫోకస్ తనవైపునకు తిప్పుకుంటున్నాడు డైరెక్టర్. ఈ చిత్రాన్ని ప్రవళ్లిక ఆర్ట్స్ క్రియేషన్స్ బ్యానర్‌పై ఎన్ సురేశ్ రెడ్డి నిర్మిస్తుండగా.. సురేశ్ బొబ్బిలి సంగీతం అందిస్తున్నాడు. చిరుగొడవలు, లావణ్య విత్ లవ్ బాయ్స్ సినిమాల్లో నటించిన పరమేశ్ హివ్‌రాలే ఈ మూవీతో డైరెక్టర్‌గా మారుతుండటంతో క్యూరియాసిటీ పెరిగిపోతుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200